**Maseeh Mauwood** (Telugu)
**(Promissed Messaiah)**

# మసీహ్ మౌవూద్

కూర్పు, అనువాదం

**అబుల్ ఇర్ఫాన్**

ఇస్లామిక్ రిసోర్స్ సెంటర్, ఫ్లాట్ నెం.**106,**
సహారా కాంప్లెక్స్, పత్తర్‌గట్టి, హైదరాబాద్-**2**
ఫోన్ నెం. **66710795, 9441515414**

వెల..............................................రూ. 25/-లు

Name of the Title : Maseeh Mauwood (Telugu)
(Promissed Messaiah)
Compilation & Translation by : Abul Irfan
*All Rights Reserved with Publishers*
First Edition : : April 2000 (2000 Copies)
Second Edition Copies : ........2010 (1000 Copies)
**Price** : **Rs. 25/-**
Published by : Islamic Resource Centre
Sahara Complex-106, Pathargatti,
Hyderbad-2. Ph: 66710795
Printed at : : Alifine Graphics
Lakkadkot, Chatta Bazar,
Hyderabad-500002.

## విషయ సూచిక


| నెం. | విషయం | పేజి |
|---|---|---|
| 01. | మసీహ్ ద్వితీయ ఆగమనం | 06 |
| 02. | ఖాదియానీ పూర్వపరాలు | 13 |
| 03. | వక్రభాష్యాలు | 19 |
| 04. | అంతిమ దైవదౌత్యం | 27 |
| 05. | అవాకులు - చవాకులు | 33 |
| 06. | పారని భవిష్యత్ ప్రకటనలు | 38 |
| 07. | ఇంగ్లీషు ప్రవక్త బోధనలు | 44 |
| 08. | ఖలీఫా రాసలీలలు | 49 |
| 09. | ఆంగ్లేయుల ప్రతినిధి | 51 |
| 10. | దేశవ్యాప్త ఉద్యమం | 55 |
| 11. | పసలేని వాదనలతో ప్రచారం | 59 |
| 12. | మహాప్రవక్త మహితోక్తులు | 64 |

**అబద్ధం**
**పరమ దుర్మార్గం**

“పచ్చి అబద్ధాలు కల్పించి, వాటిని దేవునికి ఆపాదించే వాడికంటే పరమ దుర్మార్గుడెవడుంటాడు?”

(దివ్యఖుర్ఆన్-7:37)

పై ప్రశ్నకు సమాధానమే ఈ పుస్తకం



# ముందుమాట

మానవుని మనస్సు బహువిచిత్రమైనది. అది ప్రారంభంలో తన చుట్టూ ఉన్న సామాజిక, సాంస్కృతిక పరిస్థితుల్ని ఎదిరించలేక వాటికి అనుగుణంగానే మసలుకుంటుంది. తర్వాత తనలో ఏదైనా అసాధారణ శక్తిసామర్థ్యాలు ఉంటే, తన చుట్టూ ఉక్కువలయంలా ఏర్పడిఉన్న పరిస్థితుల్ని క్రమంగా ఛేదిస్తూ తనకు అనుగుణమైన వాతావరణాన్ని సృష్టించుకుంటుంది. ఈ నూతన వాతావరణం సహాయంతో మనిషి ఒక్కోసారి సూర్యతేజస్సులా స్పష్టంగా కనిపిస్తున్న నగ్న సత్యాన్ని సయితం త్రోసిపుచ్చుతాడు. అంతేకాదు, తాను కల్పించుకున్న అసత్యాన్ని పరమసత్యంగా చిత్రించి నిరూపించుకోవడానికి రకరకాలుగా ప్రయత్నిస్తాడు. ఖాదియానీ మత స్థాపకుడు మిర్జాగులాం అహ్మద్ కూడా అలాంటివాడే.

ముస్లింల ఇంటపుట్టిన గులాం అహ్మద్ మొదట్లో ఇతర ముస్లింల మాదిరిగానే ఇస్లాంని విశ్వసించేవాడు. ముస్లింలాగానే మహనీయ ముహమ్మద్ (స)ని దైవదౌత్య పరంపరను పరిసమాప్తం చేసిన అంతిమ దైవప్రవక్తగా, ఈసా ప్రవక్త (అలై)ను మసీహ్ మౌవూద్‌గానే విశ్వసించేవాడు. ఈసా (అలై) పునరాగమనం పట్ల కూడ నమ్మకం ఉంచేవాడు. కాని ఆతర్వాత తనలో ఉన్న ఇస్లాంవ్యతిరేక శక్తుల దుష్ప్రచారాన్ని తిప్పికొట్టగల సామర్థ్యాన్ని, నానాటికి పెరుగుతున్న తన అనుచరసంఖ్యను, బ్రిటీష్‌ప్రభుత్వం అందజేస్తున్న సహాయసహకారాలు చూసుకొని విర్రవీగిపోయాడు. దాంతో ముస్లింజగత్తులో అనేక శతాబ్దాల నుండి కొనసాగుతున్న ఇస్లాం విశ్వాసాలకు వ్యతిరేకంగా ప్రకటనలు చేయడం మొదలెట్టాడు.

మొదట్లో తాను మత సంస్కర్తనని, మెహ్దీనని చెప్పుకున్నాడతను. ఆ తరువాత తాను ఏం చెప్పినా తన శిష్యగణం గుడ్డిగా నమ్మేస్థితిలో ఉండటం గమనించి తాను మసీహ్ మౌవూద్‌నని, రెండవసారి ఆకాశం నుండి నేరుగా దిగివచ్చిన ఈసాఇబ్నెమర్యంనని, చివరికి తాను సాక్షాత్తూ దైవప్రవక్తనని ప్రకటించుకున్నాడు. పైగా అతను ఇస్లాంకు వ్యతిరేకంగా ముస్లిం సమాజంలో కొత్త విశ్వాసాలను ప్రచారం చేస్తూ, దైవప్రవక్తలను కించపరచడానికి సయితం వెనకాడలేదు.

ఈ కారణంగానే ఇస్లాం ధర్మవేత్తలంతా మిర్జా గులాం అహ్మద్ స్థాపించిన ఖాదియానీ మతాన్ని ఇస్లామేతర మతంగా, అతని అనుచరుల్ని అవిశ్వాసులుగా పరిగణిస్తూ ఫత్వాలు (ధార్మిక తీర్పులు) జారీచేశారు. ఖాదియానీల మత ప్రచార

కార్యకలాపాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ముస్లింలను హెచ్చరించారు.

ఖాదియానీలను అహ్మదీయులని కూడా అంటారు. వీరు తమ మతాన్ని ఖాదియానీ మతమని చెప్పుకోకుండా ఇస్లాంలోనే అహ్మదీయ సంఘంగా చెలామణి అవుతూ, ధర్మజ్ఞానం అంతగా లేని ముస్లింలను తమ కల్లబొల్లి మాటలతో, అహేతుకమైన వాదనలతో తమ వైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. ఇలాంటి ఇస్లాంవ్యతిరేక శక్తుల దుష్ప్రచారం గురించి ముస్లింలను, ఇస్లాం అధ్యయనం చేయగోరుతున్న ముస్లిమేతరుల్ని హెచ్చరించడానికి ఉద్దేశించినదే ఈ చిరుపుస్తకం.

ఈ పుస్తకంలో మిర్జాగులాం అహ్మద్ బూటకపు దైవప్రవక్త అని, అతని బోధనలు ఇస్లాం విశ్వాసాలకు పూర్తిగా వ్యతిరేకమైనవని, అతను చేసిన భవిష్యత్ ప్రకటనలు వట్టి అభూత కల్పనలని ఆధారాలతో సహా నిరూపించబడ్డాయి. ఈ పుస్తకరచన సందర్భంగా మౌలానా అబుల్‌హసన్ అలి నద్వీగారి 'ఖాదియానియత్', మంజూర్‌అహ్మద్ చెన్యూటిగారి 'అంగ్రేజి నబి', మౌలానా మౌదూది గారి 'ఖత్మె నబువ్వత్, ఖాదియానీ మస్ల, మౌలానా ముహమ్మద్ యూసుఫ్ లూథియాన్వీ గారి 'ఫిత్నా ఖాదియానియత్', మౌలానా మంజూర్‌నోమానీ గారి 'ఖాదియాని యత్ పర్ గౌర్', మౌలానా ఖాలిద్ సైఫుల్లా రహ్మానీ గారి 'ఖాదియానియత్–ఇస్లాంకె ఖిలాఫ్ బగావత్', మౌలానా అబుల్‌హసన్ అలి నద్వి–అబుల్‌ఆలా మౌదూది–ముహమ్మద్ ఖిజర్ హుసైన్‌ల సంయుక్త రచన 'ఖాదియానియత్', మిర్జా గులాం అహ్మద్ రాసిన 'హఖైఖతుల్‌వహీ', దావత్ ప్రత్యేకసంచిక (28.10.96) 'ఆలమీమజాహబ్' వగైరా పుస్తకాలను పరిశీలించడం జరిగింది.

మసక వెల్తురులో కాంతి ఏదో, చీకటి ఏదో తెలుసుకోవడం కష్టం. కాంతిని కనుగొని, దాని విలువ ఎంతో అంచనా కట్టదలచుకున్న వారు చీకటి గురించి కూడా కొంతైనా తెలుసుకోవడం ఎంతైనా అవసరముంది. కాంతివంతమయిన ఇస్లాం పేరుతో ప్రచారమవుతున్న చీకటిమయ ఖాదియానీ మతం నిజస్వరూపం ఈ పుస్తకంలో చిత్రీకరించడం జరిగింది. అందువల్ల పాఠకులు ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని, తాము స్వయంగా చదివి తెలుసుకోవడమే కాకుండా, ఇతరుల్ని కూడా ఖాదియానీ మత ప్రమాదం గురించి హెచ్చరిస్తారని ఆశిస్తున్నాను.

1–04–2000 భవదీయుడు
హైదరాబాద్–2 అబుల్ ఇర్ఫాన్



కరుణామయుడు కృపాసాగరుడయిన అల్లాహ్ పేరుతో ప్రారంభం

# మసీహ్ మౌవూద్

యూదులు, క్రైస్తవులు, ముస్లింలు, ఖాదియానీలు (అహ్మదీయులు) విశ్వసిస్తున్న దైవప్రవక్త హజ్రత్ ఈసా (అలైహి)ను మసీహ్ అంటారని చాలా మందికి తెలుసు. కాని "మసీహ్ మౌవూద్" ని గురించి మాత్రం కొందరికే తెలుసు. వివిధ మతస్థుల మధ్య హజ్రత్ ఈసా (అలైహి) విషయంలో ఎలా భేదాభిప్రాయాలున్నాయో, మసీహ్‌మౌవూద్ విషయంలోనూ భేదాభి ప్రాయాలున్నాయి. అందువల్ల "మసీహ్‌మౌవూద్" గురించి తెలుసుకోవలసిన ఆవశ్యకత ఎంతయినా ఉంది.

మసీహ్ మౌవూద్ అంటే వాగ్దానం చేయబడిన మసీహ్ అని అర్థం. మసీహ్ అంటే అభిషక్తుడు. హజ్రత్ ఈసా (అలైహి) ప్రపంచంలో పుట్టక ముందే దైవదూతలు హజ్రత్ మర్యం (అలైహి) దగ్గరికి వచ్చి ఆయన పేరు "మసీహ్ ఈసా ఇబ్నె మర్యం" అని ఉంటుందని శుభవార్త వినిపిస్తారు (ఖుర్‌ఆన్-3:45). అయితే యూదులు అంతకు పూర్వం అనేక వందల సంవత్సరాల నుంచే ఒక మసీహ్ కోసం ఎదురుచూస్తుండేవారు. ఇప్పటికీ ఎదురుచూస్తున్నారు. ఈ మధ్య ఏం జరిగిందనేది కాస్త పరిశీలిద్దాం.

## మసీహ్ ద్వితీయ ఆగమనం-1

అఖ్సా మస్జిద్ (బైతుల్ మఖ్దిస్) నిర్మాత, దైవప్రవక్త అయిన హజ్రత్ సులైమాన్ (అలైహి) మరణించిన తరువాత యూదుల వైభవం క్రమేణా పతనమవుతూ, చివరికి వారు బాబిల్, అసీరియా రాజుల చేతుల్లో ఘోర పరాజయం పాలయి, చెట్టుకొకరు పుట్టకొకరు అయిపోయారు. అప్పుడు

ఆ జాతిలో ప్రభవించిన దైవప్రవక్తలు వారిని ఓదార్చుతూ, 'ఈ అవమానం నుంచి మిమ్మల్ని కాపాడటానికి దైవం తరఫున ఒక మసీహ్ రానున్నాడ'ని శుభవార్త వినిపిస్తూ ఉండేవారు. ఆయనే దేవుడు వాగ్దానం చేసిన మసీహ్. ఈ భవిష్యప్రకటనల ఆధారంగా వారు 'ఆయన చక్రవర్తి అయిఉంటాడని, యుద్ధం చేసి రాజ్యం జయిస్తాడని, దేశదేశాల నుంచి ఇస్రాయీలీలందర్నీ తెచ్చి పాలస్తీనాలో పునరావాసం కల్పిస్తాడని, అలా తమ కోసం ఓ గొప్ప సామ్రాజ్యాన్ని స్థాపిస్తాడని వారు గంపెడు ఆశలు పెట్టుకున్నారు.

అయితే వారి ఆశలకు భిన్నంగా హజ్రత్ ఈసా ఇబ్నె మర్యం (అలైహి) దేవుని తరఫున మసీహ్‌గా, ఎలాంటి మందీమార్బలంగాని, రాచరిక అట్టహాసాలుగాని, సైనికబలగాలుగానీ లేకుండా అతి నిరాడంబరంగా వచ్చేటప్పటికి వారు ఆయన్ని మసీహ్‌గా గుర్తించడానికి నిరాకరించారు. పైపెచ్చు ఆయన్ని హతమార్చడానికి పాల్పడ్డారు.

అప్పుడు దేవుడు ఆయన్ని వారి కుట్రల నుంచి కాపాడి పైకెత్తుకున్నాడు. కాని ఈ విషయం గ్రహించని యూదులు తాము ఈసాని శిలువపై హతమార్చామనే చెప్పుకుంటున్నారు. క్రైస్తవులు కూడా ఈసా శిలువపై ఎక్కించబడ్డారనే నమ్ముతున్నారు; అది వేరే విషయం. ఆనాటి నుంచి ఈనాటి వరకు యూదులు ఆ 'వాగ్దానం చేయబడిన మసీహ్- మసీహ్ మౌవూద్ (Promissed Messiah)'' కోసం నిరీక్షిస్తూనే ఉన్నారు.

ఆకాశానికి ఎత్తుకోబడిన హజ్రత్ ఈసా (అలైహి) ప్రళయకాల సమీపంలో తిరిగి నింగినుండి నేల మీదికి దిగివస్తారని ఇస్లాం చెబుతోంది. ఈ క్రింది హదీసులు చూడండి:

హుజైఫా బిన్ ఉసైదిల్ గిప్ఫారి కథనం- ఓ రోజు మేము మాట్లాడుకుంటుంటే దైవప్రవక్త (స) మా దగ్గరికొచ్చి-"ఏం మాట్లాడుకుంటున్నారు?" అని అడిగారు. మేము "ప్రళయం గురించి మాట్లాడుకుంటున్నాం" అని



చెప్పాము. అప్పుడాయన "ముందుగా పది సూచనలు బహిర్గతం కానంత వరకు ప్రళయం ఎంతమాత్రం సంభవించదు" అన్నారు. ఆ తర్వాత ఆయన ఇలా ఆ పదిసూచనలు తెలిపారు: "(1) పొగ, (2) దజ్జాల్, (3) నేల నుండి (వింత)జంతువు బయల్పడటం, (4) సూర్యుడు పడమర నుండి ఉదయిం చడం, (5) ఈసా ఇబ్నె మర్యం అవతరించడం, (6) యాజూజ్, మాజూజ్ (అనే ఆటవిక జాతు)లు, (7) మూడుచోట్ల పెద్దగా నేల క్రుంగిపోవడం- ఒకటి, తూర్పు ప్రాంతంలో, (8) రెండు, పశ్చిమ ప్రాంతంలో, (9) మూడు, అరేబియా ద్వీపకల్పంలో (10). అన్నిటికంటే చివర్లో ఓ భయంకరమైన అగ్ని యమన్‌లో బయలెడి జనాన్ని తోలుకుంటూ హష్ర్‌మైదానం వైపుకు తీసికెళ్తుంది." (ముస్లిం, అబూదావూద్)

ఇమ్రాన్ బిన్ హుసైన్ కథనం ప్రకారం దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "నా అనుచరసమాజంలో సత్య(మార్గ)ంలో స్థిరంగా, శత్రువులకు సింహస్వప్నంగా ఉండే ఒక వర్గం ఎల్లప్పుడూ ఉంటుంది. చివరికి దేవుని నిర్ణయం వస్తుంది; ఇబ్నెమర్యం అవతరిస్తారు." (ముస్నద్‌అహ్మద్)

పై హదీసుల్ని బట్టి రెండవసారి వచ్చే హజ్రత్ ఈసా (అలైహి) జన్మించరని, అవతరిస్తారని స్పష్టంగా తెలుస్తోంది. అంతేకాదు, ఆయన దైవప్రవక్త హోదాలో అవతరించరని, ఆయనపై దివ్యావిష్కృతి (వహీ) అవతరించదని, ఆయన ఎలాంటి దైవాజ్ఞలను తీసుకురారని, ముహమ్మద్ ప్రవక్త (సల్లం) తెచ్చిన షరీఅత్ (ధర్మశాస్త్రం)లో ఎలాంటి మార్పులు, చేర్పులు చేయరని, తనను విశ్వసించాలని ప్రజలను ఆజ్ఞాపించరని కూడా తెలుస్తోంది. ఆయన ఓ ప్రత్యేక కార్యనిర్వహణ కోసం వస్తారు. అదే దజ్జాల్ సంహారం. యూదులు నిజమైన మసీహ్‌మౌవూద్ (అంటే దైవప్రవక్తగా తొలిసారి ప్రభవించిన ఈసా ఇబ్నె మర్యం)ని కాదని ఏ మసీహ్ మౌవూద్ కోసం ఎదురుచూస్తున్నారో ఆ మసీహ్ పేరే దజ్జాల్ (Anti-Christ).

ఈ మసీహ్ దజ్జాల్ ప్రస్తావన కూడా హదీసుల్లో వచ్చింది. ప్రళయకాల సమీపంలో యూదుల్లోనే ఈ దుర్మార్గుడు పుట్టి వారికి నాయకుడవుతాడు. యువకుడు, ఒంటికన్నువాడు, ఉంగరాల జుట్టువాడు అయిన ఇతను తన్నుతాను మసీహ్‌గా ప్రకటించుకొని కనీవినీ ఎరుగని మహోపద్రవాన్ని సృష్టిస్తాడు. అతడ్ని సంహరించేందుకు దేవుడు హజ్రత్ ఈసా (అలైహి)ని తిరిగి భూలోకానికి పంపిస్తాడు.

"దజ్జాల్ (ఓ పెద్ద సైన్యంతో) సిరియా, ఇరాఖ్‌ల మధ్యనున్న ఒక మార్గంగుండా వెలువడుతాడు. ఎడమవైపు, కుడివైపు (సర్వత్రా) అల్లకల్లోలం సృష్టిస్తాడు... ఒక జాతి ప్రజల దగ్గరికెళ్ళి పిలిస్తే వారతడ్ని విశ్వసించి విధేయులయిపోతారు. ఆకాశాన్ని ఆదేశించి వర్షం కురిపిస్తాడు. నేలను ఆజ్ఞాపించి (చెట్లను) మొలకెత్తిస్తాడు...

మరొక జాతి దగ్గరికెళ్ళి పిలిస్తే వారతడ్ని (నమ్మడానికి) నిరాకరిస్తారు. అతను వారి నుంచి విముఖుడవుతాడు. వారు కరువుకాటకాల్లో మునిగి పోతారు. వారి దగ్గరుండే సిరిసంపదల్లో ఇక ఏమీ మిగలదు. (తరువాత) అతనొక పాడుపడ్డ ప్రదేశం మీదుగా ప్రయాణం చేస్తూ, దాన్నుద్దేశించి, "నీలోని నిక్షేపాలన్నీ బయటికి తియ్యి" అనంటాడు. అప్పుడు నిక్షేపాలన్నీ బయల్పడి తేనెటీగలు తమ నాయకుని వెనకాల నడిచినట్టు, దజ్జాల్ వెనకాల నడవడం ప్రారంభిస్తాయి. ఆ తర్వాత అతను ఒక యువకుడ్ని పిలిచి అతడ్ని ఖడ్గంతో రెండు ఖండాలు చేసి బాణం పోగలిగినంత దూరాన విసిరేస్తాడు. తిరిగి పిలువగానే ఆ యువకుడు సజీవుడయి చిరునవ్వుతో లేచి వస్తాడు..." (మిష్కాత్)

దజ్జాల్ నుదుటిపై అరబీ భాషలో కాఫిర్ (సత్యతిరస్కారి) అని స్పష్టంగా ఉన్నప్పటికీ ఈ మాయలు చూసి అనేకజాతులు అతనికి విధేయత ప్రకటి స్తాయి. అతను మదీనాపై కూడా దాడి చేయడానికి వస్తాడు. కాని మదీనాలో



ప్రవేశించలేక నగరం సమీపంలోని ఉహద్ కొండ వెనుక విడిది చేస్తాడు. అది ముస్లింలకు చాలా కఠినకాలం, భయంకర పరీక్షా సమయం. దజ్జాల్‌కు భయపడి జనం దూరదూర ప్రాంతాలకు పారిపోతారు.

దజ్జాల్ సైనికులు దారిలో ఒక ముస్లింను పట్టుకొని తీసికెళ్తారు. ఆ ముస్లిం దజ్జాల్‌ని చూడగానే 'దైవప్రవక్త (సల్లం) తెలిపిన దజ్జాల్ ఇతనే' అంటాడు. దజ్జాల్ అతడ్ని హతమార్చుతాడు. తిరిగి బ్రతికించి 'ఇప్పటికైనా నన్ను విశ్వసిస్తావా?' అని అడుగుతాడు. కాని ఆ ముస్లిం 'నువ్వు అసత్య మసీహ్‌వి. నిన్ను గుర్తించడంలో నా విశ్వాసం ఇప్పుడు మరింత పెరిగింది' అనంటాడు. మరోవైపు అక్కడున్న జనంతో 'ప్రజలారా! దజ్జాల్ నా తరువాత మరెవరి పట్లా ఇలాచేయలేడు' అనికూడ అంటాడు. దజ్జాల్ అతడ్ని పట్టుకొని హతమార్చడానికి రకరకాలుగా ప్రయత్నిస్తాడు. కాని చంపలేక పోతాడు.

-(మిష్కాత్‌లోని కొన్ని హదీసుల ఆధారంగా)

ఈవిధంగా దజ్జాల్ ప్రపంచంలో నలుమూలలా అశాంతి, అలజడులు సృష్టిస్తుంటే ముస్లింలు అతడ్ని ఎదుర్కోవడానికి యుద్ధసన్నాహాలు ప్రారంభిస్తారు. అప్పుడు హజ్రత్ మసీహ్ ఈసా (అలైహి) నింగి నుంచి నేరుగా భూమ్మీదకు దిగివస్తారు.

దైవప్రవక్త (సల్లం) ఇలా ప్రవచించారు: "నాకు, ఆయనకు (అంటే ఈసా ఇబ్నె మర్యంకు) మధ్య ఎలాంటి దైవప్రవక్త లేడు. ఆయన (నింగి నుండి) అవతరించనున్నారు. కనుక మీరు ఆయన్ని చూసినప్పుడు గుర్తు పట్టాలి. ఆయన మధ్యరకం ఎత్తు కలిగివుంటారు. తెలుపు, ఎరుపు రంగులు కలసిన దేహవర్ణం ఆయనది..." (అబూదావూద్, ముస్నద్ అహ్మద్)

"దేవుడు మర్యం కుమారుడు మసీహ్‌ని ప్రభవింపజేస్తాడు. ఆయన (హఠాత్తుగా) డెమాస్కస్ తూర్పుభాగంలో ఉండే శ్వేత స్థూపం (White

Minaret) వద్ద దిగుతారు. రెండు పచ్చవస్త్రాలు ధరించి, ఇద్దరు దైవదూతల రెక్కల మీద చేతులు ఉంచి దిగుతారు. తల క్రిందికి వాల్చినప్పుడు ఆయన తల నుంచి (నీటి)చుక్కలు రాల్తున్నట్లు, తల పైకెత్తినప్పుడు ముత్యాల్లా (జల) బిందువులు జాలువారుతున్నట్లు కనిపిస్తుంది.." (ముస్లిం)

అది ప్రాతఃకాల సమయం. ముస్లింలు యుద్ధసన్నాహాలు పూర్తి చేసి ఫజ్ర్ నమాజ్ కోసం బారులు తీరి నిల్చుంటారు. ఇఖామత్ చెప్పడం కూడా అయిపోతుంది. ఇమామ్ నమాజ్ చేయడానికి సిద్ధమవుతాడు. సరిగ్గా ఆ సమయంలో ఈసా ఇబ్నె మర్యం (అలైహి) పైన వర్ణించబడిన విధంగా దిగుతారు. (మిష్కాత్)

ఇమామ్ ఆయన్ని చూడగానే కాస్త వెనక్కి తగ్గి "రండి, నమాజ్ చేయించండి" అనంటాడు. దానికి ఆయన "ఈ ఉమ్మత్ (ముహమ్మద్ అనుచర సమాజం) ప్రజలే స్వయంగా ఒకరిపైనొకరు ఇమాంలు (కనుక మీరే నమాజ్ చేయించండి)"అని జవాబిస్తారు. అప్పుడు ముస్లిం నాయకుడు (ఇమామ్) ముందుకువచ్చి నమాజ్ చేయిస్తాడు. (ముస్లిం)

నమాజ్ ముగిసిన తరువాత హజ్రత్ ఈసా (అలైహి) ఆయుధం తీసుకొని దజ్జాల్‌ని సంహరించడానికి బయలుదేర్తారు. ఆయన (నగర ప్రధాన) ద్వారం తెరవమని ఆజ్ఞాపిస్తారు. ద్వారం తెరవబడుతుంది. బయట దజ్జాల్ డెబ్బయి వేల మంది సాయుధులయిన యూదులతో విడిదిచేసి ఉంటాడు, అతను హజ్రత్ ఈసా (అలైహి)ను చూడగానే నీళ్ళలో వేసిన ఉప్పులా కరిగిపోతూ భీతావహుడయి పలాయనం చిత్తగిస్తాడు. హజ్రత్ ఈసా (అలైహి) అతడ్ని వెంబడించి (ఇస్రాయీల్ ప్రస్తుత రాజధాని టెల్ అవివ్‌కు కొన్ని మైళ్ళ దూరంలో ఉన్న) 'లుద్దా'లో తూర్పు ముఖద్వారం దగ్గర హతమార్చుతారు. దజ్జాల్ అనుచరులు దాక్కోవడానికి ఎక్కడా చోటు దొరకదు. ప్రతి రాయి, గుట్ట సయితం ' ఓ విశ్వాసీ! ఇటు వచ్చేయి.



ఇక్కడ నా వెనుక ఒక యూదుడు దాక్కున్నాడు. ఇతడ్ని చంపెయ్యి' అంటూ పలుకుతాయి. ఆ విధంగా దేవుడు వారిని నాశనం చేస్తాడు.

(ముస్నద్ అహ్మద్, ఇబ్నెమాజ, ముస్లిం)

"హజ్రత్ ఈసా (అలైహి) కాలంలోనే మరో ఉపద్రవం తలెత్తుతుంది. (రష్యా, ఉత్తర చైనా ప్రాంతాల నుంచి) యాజూజ్, మాజూజ్ (అనే కొన్ని ఆటవిక జాతులు) కూడా బయలుదేరి పెద్ద కల్లోలాన్ని సృష్టిస్తాయి. అలా వారు అల్లకల్లోలం సృష్టిస్తూ బైతుల్ మఖ్దిస్ సమీపానికి వస్తారు. హజ్రత్ ఈసా (అలైహి)ని, ఆయన అనుచరుల్ని (విశ్వాసుల్ని) దిగ్బంధిస్తారు. హజ్రత్ ఈసా (అలైహి), ఆయన అనుచరులు దైవాన్ని ప్రార్థిస్తారు. వారి శాప ఫలితంగా ఆ దుర్మార్గులు దేహాల్లో పురుగులు పడి సర్వనాశన మవుతారు. వారి శవాలతో భూమి నిండిపోయి దుర్వాసన కొడ్తుంది. హజ్రత్ ఈసా (అలైహి) మళ్ళీ దుఆ చేస్తారు. అప్పుడు దూడబోతుల్లాంటి ఒక విధమయిన పక్షులు వచ్చి ఈ శవాలను తీసికెళ్ళి దూరంగా దైవం ఆదేశించిన చోట పడవేస్తాయి." (మిష్కాత్)

హజ్రత్ ఈసా (అలైహి) పునరాగమనంతో క్రైస్తవుల అపోహలు దూరమై వారికి వాస్తవం తెలిసిపోయింది. ఈసా (అలైహి) శిలువను విరగ్గొడుతారు; పందిని వధిస్తారు. (అంటే ఈసా శిలువపై చనిపోయారన్న వారి అంధవిశ్వాసాన్ని, త్రిత్వాన్ని అంతమొందించి, ఇతర అనేక మూఢనమ్మకాలు, దురాచారాలతోపాటు, తమంతట తాము ధర్మసమ్మతం చేసుకున్న పందిమాంసాన్ని సైతం నిషేధిస్తారన్నమాట). దుర్జనులు నాశనమైపోగా మిగిలిపోయిన ముస్లింలతో భూమి నిండిపోతుంది. ప్రపంచంలోని యావన్మంది ధర్మం ఒకటే అయిపోతుంది. మానవులు అల్లాహ్‌ను తప్ప ఇతరులను ఆరాధించడం జరగదు. (చూడండి ముస్నద్ అహ్మద్, ఇబ్నెమాజ)

ఆ తరువాత హజ్రత్ ఈసా (అలైహి) కాలంలో సర్వత్రా శాంతి, సౌభ్రాతృత్వం, నీతి, న్యాయం నెలకొంటాయి. ఇద్దరు వ్యక్తుల మధ్య కూడా

శత్రుభావం ఉండదు. ధన సంపత్తి విపరీతంగా పెరిగిపోతుంది. చివరికి దానం స్వీకరించగల ఒక్క మనిషీ కన్పించడు. శిస్తులు, పన్నులు రద్దయి పోతాయి. ఆ విధంగా హజ్రత్ ఈసా (అలైహి) ప్రపంచంలో ఏడేళ్ళు (ఒక ఉల్లేఖనం ప్రకారం నలభై ఏళ్ళు) జీవించి ఆ తరువాత (సహజ మరణం ద్వారా) తన ప్రభువు సన్నిధికి చేరుకుంటారు. (ముస్లిం, మిష్కాత్)

ఇవీ మసీహ్ గురించి మహాప్రవక్త ముహమ్మద్ (స) తెలిపిన విశేషాలు. వీటినిబట్టి ముహమ్మద్ మహోదయునికి (స) పూర్వం దైవసందేశహరునిగా ప్రభవించిన హజ్రత్ ఈసా ఇబ్నె మర్యం (అలైహి) మాత్రమే మసీహ్ మౌవూద్ అని స్పష్టంగా తెలుస్తోంది. ఆయన తరువాత మరో మానవుడు మసీహ్ కాలేడు. అంతేకాకుండా దివి నుండి భువికి పునరాగమనం జరిగినప్పుడు ఆయన కూడా మసీహ్ మౌవూద్ హోదాలో రారు. అదీగాక అప్పుడాయన దైవసందేశం (Revelation) పొందుతూ, ఆజ్ఞలను నిర్దేశించే అధికారం కలిగిన దైవప్రవక్తగా కూడా రారు. ఆయన కేవలం మర్యం కుమారుడు ఈసా లేక మసీహ్‌గా, న్యాయశీలుడైన అధికారిగా మాత్రమే వస్తారు.

## ఖాదియానీ పూర్వపరాలు-2

కాగా మసీహ్ మౌవూద్‌గా వచ్చిన ఈసా (అలైహి)ని యూదులు తిరస్కరించి అసత్య మసీహ్ మౌవూద్ అయిన దజ్జాల్ కోసం నిరీక్షిస్తున్నారు. అయితే గత శతాబ్దాంతంలో భారత ఉపఖండం (ప్రస్తుత పాకిస్తాన్)లోని ఖాదియాన్ గ్రామంలో మిర్జా గులాం అహ్మద్ అనే ఒకాయన తనను తాను మసీహ్ మౌవూద్‌గా, గొప్ప దైవప్రవక్తగా ప్రకటించుకున్నాడు. ఈయన్ని విశ్వసించినవారిని ఖాదియానీలు లేక అహ్మదీయులు అంటారు.

అహ్మదీయులు అనబడే ఈ ఖాదియానీలు ఇస్లాంను అంటిపెట్టు కొని ఉన్నామని చెబుతూనే ఇస్లాం మౌలిక విశ్వాసాలకు విరుద్ధంగా ప్రవర్తిస్తున్నారు. మరోవైపు మహనీయ ముహమ్మద్ (సల్లం)ని అంతిమ దైవప్రవక్తని ఒప్పుకుంటూనే ప్రవక్తల పరంపర అంతం కాలేదని, తమ నాయకుడు మిర్జాగులాం అహ్మద్ కూడా దైవప్రవక్తని, మసీహ్ మౌవూద్ అని నమ్ముతున్నారు. అందువల్ల అహ్మదీయుల ఈ ద్వంద్వ వైఖరికి మూల కారకుడయిన మిర్జాగారి చరిత్ర, దైవదౌత్య ప్రకటనకై ఆయన్ని పురికొల్పిన శక్తులు, ఆయన లేవదీసిన కొత్త మతవిశ్వాసాలు మొదలైన విషయాలను గురించి కూడా తెలుసుకోవడం చాలా అవసరం.



మిర్జా గులాం అహ్మద్ 1840లో పంజాబ్ రాష్ట్రం, గురుదాస్‌పూర్ జిల్లా ఖాదియాన్ గ్రామంలో ఓ మధ్యతరగతి కుటుంబంలో జన్మించాడు. 1864 నుంచి 1868 వరకు నాలుగేళ్ళ పాటు ఉద్యోగం చేసి రిజైన్ చేశాడు. తరువాత స్వగ్రామంలోనే పొలం పనులు చూసుకుంటూ మతగ్రంథాల అధ్యయనంపై దృష్టి కేంద్రీకరించాడు. వివిధ మతగ్రంథాల్లో, ప్రత్యేకంగా క్రైస్తవ, హైందవ మతగ్రంథాల్లో ఆర్జించిన అపారజ్ఞానాన్ని గ్రంథ రచనల్లో, చర్చావేదికల్లో వినియోగించసాగాడు. ఇస్లాంకు వ్యతిరేకంగా క్రైస్తవఫాదరీలు, ఆర్యసమాజ నాయకులు సాగించే దుష్ప్రచారాన్ని తన అసమాన ప్రతిభతో తిప్పికొట్టేవాడు. దాంతో ముస్లిం సమాజంలో ఆయన పేరుప్రతిష్ఠలు పెరగసాగాయి.

మిర్జా ఆరోగ్యం గురించి కూడా పేర్కొనడం ఇక్కడ సముచితంగా ఉంటుంది. అతనికి యౌవ్వనంలో హిస్టీరియా వ్యాధి ఉండేది. దానివల్ల అతను ఒక్కోసారి స్పృహతప్పి పడిపోయేవాడు (సీరతుల్ మహ్దీ, మొదటి భాగం, పేజీ 17 చూడండి). అతనికి డయాబిటీస్ (అతి మూత్రవ్యాధి కూడా ఉండేది. అతిగా మాట్లాడటం అతనికున్న మరో ప్రత్యేకత. అతను ఓసారి తనను తాను శాశ్వత వ్యాధిగ్రస్తుణ్ణని పేర్కొన్నాడు.

(జమీమా అర్బయీన్, పేజి 3 చూడండి).

మిర్జాగారి మేధలో జనించిన కొత్త విశ్వాసాలకు ఊపిరిపోసిన పూర్వ పరాలు ఈ సందర్భంలో గమనార్హమైనవి. ప్రముఖ ఆంగ్లేయుడు హెన్రీ చేత 'ఇస్లామీయవిప్లవం'గా వర్ణించబడిన 1857నాటి భారత స్వాతంత్ర్య యుద్ధం (సిపాయిల తిరుగుబాటు) విఫలమవడంతో ముస్లింలపై నిరాశా నిస్పృహలు ఆవరించాయి. యుద్ధంలో విజయం సాధించిన ఆంగ్లేయులు ఆ వెనువెంటనే తమ రాజ్యాన్ని, నాగరికతాసంస్కృతుల్ని విస్తరింపజేసుకు నేందుకు విస్తృతకార్యక్రమం ప్రారంభించారు. ముఖ్యంగా ముస్లింల మత విశ్వాసాలు బలహీనపరచి, బానిసత్వానికి వ్యతిరేకంగా వారిలో ఇస్లాం నూరి పోసిన సమరోత్సాహాన్ని నీరుకార్చడానికి వారు దుష్టపన్నాగాలు పన్నారు.

సిపాయిల తిరుగుబాటు ఉద్యమం విఫలమైనప్పటికీ, ఇస్లామీయ ఉద్యమాల నుండి బ్రిటీష్ సామ్రాజ్యానికి ఎదురైన ప్రమాదం ఇంకా తొలగి పోలేదు. 19వ శతాబ్దం ప్రథమార్థంలో సయ్యిద్ అహ్మద్ షహీద్ (రహ్మలై) బ్రిటిష్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా లేవదీసిన జిహాద్ ఉద్యమంలో వేలాది యువకులు అమితోత్సాహంతో చేరుతూనేఉన్నారు. మరొక వైపు సూడాన్‌లో షేఖ్ ముహమ్మద్ అహ్మద్ సూడాని ఇచ్చిన జిహాద్ నినాదం బ్రిటిష్ అధికార పీఠం క్రింద ప్రకంపనాలు సృష్టించసాగింది. వేరొకవైపు అఫ్ఘనిస్తాన్‌లో సయ్యిద్ జమాలుద్దీన్ అఫ్ఘాని ప్రారంభించిన ఇస్లామీయ సమైక్యతా ఉద్యమం ముస్లింలలో ఓ నూతనుత్తేజాన్ని జనింపజేసింది.

ఈ మూడు ఉద్యమాలు తమ సువిశాలసామ్రాజ్యానికి నీలినీడలుగా పరిణమించి తుదముట్టిస్తాయని ఆంగ్లేయులు భయపడ్డారు. ఈ ఉద్యమా లను తమ తుపాకులు పూర్తిగా అణచలేవని కూడా వారు భావించారు. దాంతో వారు ముస్లింల ధార్మిక భావోద్రేకాలను లోతుగా అధ్యయనంచేసి, వారి మతవిశ్వాసాలను, వారి ధార్మిక భావోద్రేకాలను అదుపులో ఉంచడమే ఈ సమస్యకు ఏకైక పరిష్కార మార్గమని నిర్ణయానికి వచ్చారు.



భారత దేశంలోని ముస్లింల ధార్మిక స్థితి ఎలా ఉందో, ప్రత్యేకంగా ఆంగ్లేయులకు వ్యతిరేకంగా వారి మనస్తత్వాలు ఏమిటో తెలుసుకోవడానికి బ్రిటీష్ ప్రభుత్వం 1869లో ఒక కమీషన్‌ని నియమించింది. ఈ కమీషన్ మన దేశంలో ఒక ఏడాదిపాటు ఉండి ముస్లింల మనోభావాలు, వారి మతవిశ్వాసాలు, రాజకీయ, సాంస్కృతిక స్థితిగతులు అన్నీ పరిశీలించి బ్రిటన్‌కు తిరిగొచ్చింది. రాగానే 1870లో లండన్‌లో ఓ కాన్ఫరెన్సు ఏర్పాటు చేసింది. ఆ కాన్ఫరెన్సులో కమీషన్ సభ్యులతోపాటు క్రైస్తవ మిషనరీ ఫాదరీలు కూడా కొంతమంది ఉన్నారు. మొదట కమీషన్ అధ్యక్షుడు సర్ విలియం హైండ్ సమర్పించిన నివేదికను చూడండి:

"ముస్లింల మతవిశ్వాసం ప్రకారం వారు ఏ పరదేశ ప్రభుత్వం పంచన కూడా ఉండలేరు. పరదేశ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోరాడటం వారికి అత్యంతావశ్యకం. ఆ యోచన వారి హృదయాల్లో ఓ నూతనోత్సాహాన్ని, ఉద్రేకాన్ని జనింపజేస్తుంది. వారు ఈ పోరాటానికి అనుక్షణం సిద్ధంగా ఉంటారు. వారి ఈ స్థితి విదేశీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఏ సమయంలో నయినా వారిని ఉద్రేకపరచగలదు."

క్రైస్తవ మిషనరీ ఫాదరీల నివేదికను కూడా చూడండి:

"ఇక్కడి ప్రజల్లో ఒకవర్గం వైరాగ్యభావాలు, పీరీమురీది (మత గురు పీఠం) తత్వంగల ముస్లిములు కూడా ఉన్నారు. ఇప్పుడు మనం తాను దైవప్రవక్తనని ప్రకటించుకోగల ఒక ద్రోహిని అన్వేషించగలిగితే అమితమైన ఉత్సాహంతో వేలాది ప్రజలు అతని బూటకపు దైవదౌత్య పరిధిలోకి వస్తారు. అయితే ముస్లిములలో అలా ప్రకటించుకో గల వ్యక్తిని తయారుచేయడం చాలా కష్టం. కష్టతరమైన ఈ పని గనక పరిష్కరించబడితే ఆ వ్యక్తికి ప్రభుత్వం తరపున ఆశ్రయమిచ్చి మన పని నెరవేర్చుకోవచ్చు. ఇంతకు

ముందు దేశద్రోహుల్ని వెతికేపాలసీతో మనం భారత ఉపఖండంలో ఉన్న రాజ్యాలన్నిటిని మట్టుబెట్టాము. కాని అప్పటి పరిస్థితి వేరు. అప్పుడు సైనిక దృష్టితో ద్రోహులను అన్వేషించాము. ఇప్పుడు మనం ఉపఖండంలో అనేక చోట్ల పాలకులమయ్యాం. సర్వత్రా ప్రశాంతత నెలకొన్నది. కనుక ఇలాంటి స్థితిలో మనం ఇక్కడ ప్రజల్లో అంతర్విభేదాలు సృష్టించగల ఓ సరికొత్త పథకాన్ని రూపొందించవలసి ఉంది.''

(వైట్‌హౌస్ కాన్ఫరెన్స్ రిపోర్ట్, 'ది ఎరైవల్ ఆఫ్ బ్రిటీష్ ఎంపైర్ ఆఫ్ ఇండియా')

బ్రిటీష్ ప్రభుత్వం తన పథకాన్ని అమలుపరచడానికి మొట్టమొదట క్రైస్తవ ఫాదరీలను రంగంలోకి దించింది. ధర్మసంస్థాపనకై నిర్మాణాత్మక కృషి, జిహాద్ భావాల నుంచి ముస్లింల దృష్టిని మరల్చడానికా అన్నట్లు వీరు ఆరోజుల్లో విభిన్న మతవర్గాల మధ్య వేడి వాడి చర్చలు, వాదోపవాదాల వాతావరణాన్ని సృష్టించారు.

ఇలాంటి మత ప్రచార సమరంలో మిర్జా గులాం అహ్మద్ ముస్లింలకు గొప్పయోధుడిగా కన్పించాడు. ముస్లింలలో తన పట్ల నానాటికి పెరుగుతున్న కీర్తిప్రతిష్ఠలు, గౌరవాదరణలను గమనించిన మిర్జాగారు తాను యావత్తు ప్రపంచముస్లింలకు గొప్ప నాయకుడ్ని కావాలని అనుకున్నాడు. ముహమ్మద్ ప్రవక్త (సల్లం) లాగే తానూ ఓ కొత్త మతానికి వ్యవస్థాపకుడు కావాలని, తన చుట్టూ అనేక మందిని విశ్వాసులుగా చేర్చుకొని మహాప్రవక్తగా వెలుగొందాలని, ముహమ్మద్ ప్రవక్త (సల్లం)లాగే తన పేరు కూడా చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోవాలని ఉవ్విళ్ళూరారు.

దాని కోసం ఆయన మొదట ఇస్లాం యదార్థతను, మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం) దైవదౌత్యాన్ని గట్టి ప్రమాణాలతో హేతుబద్ధంగా నిరూపించడానికి ఓ పెద్ద గ్రంథాన్ని రచించబోతున్నానని ప్రకటించి,



అందుకు విరాళాలు అందజేయవలసిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఆ గ్రంథానికి 'బరాహీన్ అహ్మదియా' అని పేరు కూడా పెట్టారు.

బరాహీన్ అహ్మదియా గ్రంథ రచన 1879లో ప్రారంభమయింది. 1884 నాటికి ఈ గ్రంథానికి సంబంధించిన నాలుగు భాగాలు అచ్చయి బయటికి వచ్చాయి. ఆ తరువాత దాని అయిదో భాగం 21 ఏళ్ళు గడిచాక 1905లో గాని ప్రచురించబడ లేదు. అంతేకాకుండా మొదట్లో 50 భాగాల్లో రాస్తానని చెప్పిన ఈ మహానుభావుడు అయిదో భాగంతోనే నిలిపివేశారు. అదేమంటే అయిదోభాగం తొలిపలుకుల్లో ''మొదట్లో 50 భాగాలు రాయడానికి నిర్ణయించుకున్నాను. కాని (సంఖ్యలు) 50కు 5కు ఒక చుక్కే (సున్నే) కదా తేడా; అందుకని 50ని 5కు తగ్గించి సరిపుచ్చాను. 5 భాగాలతో (నేను చేసిన) ఆ వాగ్దానం నెరవేరింది'' అని రాశారు!

మొదట రాసిన నాలుగు భాగాలతో పాటు మిర్జా సాహెబ్ ఉర్దూ, ఇంగ్లీషు భాషల్లో ఒక ప్రకటన పత్రాన్ని అచ్చువేయించి క్రైస్తవ హైందవ పండితులకు పంపించారు. అందులో తాను ఇస్లాం సత్యసంధతను వెలువరించడానికి దేవుని చేత నియమించబడ్డానని, యావత్తు మతస్థులను సంతృప్తపరచగలనని, నబినాసిరి ఇస్రాయీల్ (మసీహ్) పంథాలో అత్యంత నిర్భాగ్య, నిరాడంబర, అసహాయత, అల్పత్వాలతో మానవ సంస్కరణకై కృషి చేస్తానని ఆయన మొదటిసారిగా చెప్పుకున్నారు.

(చూ. బరాహీన్ అహ్మదియా, మొదటి భాగం, పే. 82)

బరాహీన్ అహ్మదియా గ్రంథ రచనకు పూర్వం జరుగుతూ వచ్చిన మరో విశేషాన్ని కూడా ఇక్కడ గుర్తు చేసుకోవడం సందర్భోచితంగా ఉంటుంది. ఆనాడు ఆంగ్లేయులు కొత్త నాగరికతా సంస్కృతులతో ముందే నైరాశ్యానికి లోనయి ఉన్న ముస్లింలలో వేరొక వైపు అజ్ఞానులయిన కొందరు సూఫీలనబడే వారు మహిమలు, దివ్యశక్తులు, దైవికస్వప్నాల పేరిట జన

సామాన్యంలో మూఢనమ్మకాలను వ్యాపింపజేయసాగారు. హిజ్రీ 13వ శతాబ్దాంతంలో మసీహ్ మౌవూద్ ప్రభవించే అవకాశముందన్న మాటలు కూడా అప్పుడప్పుడు వినవచ్చేవి. దైవంచే నియమించబడ్డానని మిర్జా సాహెబ్ చెప్పుకున్న పై మాటలతో ఈ విశేషాన్ని చేర్చి పరిశీలిస్తే ఆ తరువాత ఆయన ప్రకటించిన బూటకపు దైవదౌత్యానికి పునాదులు ఏర్పడ్డాయని సులభంగా ఊహించవచ్చు.

## వక్ర భాష్యాలు-3

ఇంతకూ ఈ గ్రంథంలోని సారాంశం ఏమిటో పరిశీలిస్తే ప్రజలకు ఆశ్చర్యం, ఒకింత ఆగ్రహం కూడా కలుగుతుంది, కలిగింది కూడా. ఈ మనిషి ఎప్పుడో హఠాత్తుగా దైవప్రవక్తనని కూడా చెప్పుకోవడం జరగవచ్చని అప్పుడే అనేక మంది ధర్మవేత్తలు అనుమానించారు. మిర్జాగారు ఏ లక్ష్యం కొరకయితే ఈ మహాకార్యం చేపడుతున్నానని ప్రజల ముందు ప్రకటించారో, దానికి భిన్నంగా దైవిక ప్రేరణలు, దివ్య సంభాషణలు, అద్భుతాలు, అసాధారణ శక్తులు, జోస్యాలు, వైశిష్ట్యాలు, కలలు, మహిమలు, వాదనలు, సవాళ్ళతో ఈ గ్రంథాన్ని నింపేశారు.

మిర్జా గులాంఅహ్మద్ ఈ గ్రంథంలో దైవిక ప్రేరణ (ఇల్హామ్) ద్వారా దేవుడు తనకు పంపాడని చెప్పుకున్న విషయాలన్నీ వాస్తవానికి- ఖుర్ఆన్ సూక్తులలో సందర్భం నుండి వేరుచేయబడిన, ఒక దానికొకటి పొంతనలేని కొన్ని తునకల సముదాయం, మధ్యమధ్య కొన్ని హదీసులు, ఆయన సొంత మాటలతో కూడిన ఒక కలగూరగంప మాత్రమే. అంతేకాదు ఇల్హామ్ ద్వారా అందాయని చెప్పబడుతున్న ఈ సూక్తులు అరబీ భాషలో మాత్రమే కాకుండా అక్కడక్కడ ఉర్దూ, ఫార్సీ, ఇంగ్లీషు భాషల్లోనూ ఉన్నాయి!

1884 వరకు ప్రచురించబడిన ఈ నాలుగు భాగాల్లో మిర్జా గులాం అహ్మద్ తనకు దైవికప్రేరణ (ఇల్హామ్) ద్వారా దేవుని ఆదేశాలు అందుతున్నాయని తాను దైవం తరపున నియుక్తుడయిన నవయుగ సంస్కర్త (ముజద్దిద్)నని, తనకు హజ్రత్ మసీహ్ (ఈసా) అలైహిస్సలాం సారూప్యతా భాగ్యం లభించిందని మాత్రమే చెప్పుకున్నాడు. ఈ "ఆదేశాల"లో ఆయన హజ్రత్ మసీహ్ (అలైహి) ఆకాశానికి ఎత్తుకోబడ్డార (Ascended)ని, తిరిగి భూమిపైకి దిగి వస్తారని కూడా ఒప్పుకున్నాడు. అయితే ఆ తరువాత ఏడేళ్ళకే (1891లో) అతను తనను తాను నేరుగా మసీహ్ మౌవూద్‌నని ప్రకటించుకున్నాడు.



మిర్జా గులాం అహ్మద్ ఇలా ప్రకటించగానే దాన్ని వందల మంది ధర్మవేత్తలు ఖండిస్తూ, తీవ్ర నిరసన వ్యక్తపరిచారు. వారికి వివరణ ఇవ్వడానికి మిర్జా ప్రత్యేకంగా మరికొన్ని పుస్తకాలు రాయవలసివచ్చింది. వాటిలో తాను మసీహ్ మౌవూద్‌నని నిరూపించుకోవడానికి ఖుర్ఆన్, హదీసులకు వక్రభాష్యాలు చెబుతూ అసత్యాలు, అర్థసత్యాలతో జనాన్ని ఎలా తికమక పెట్టాడో చూడండి:

"హజ్రత్ మసీహ్ (అలైహి) స్వభావం నుండి వచ్చే ఓ ప్రత్యేక సారూప్యం ఉంది. ఆ స్వాభావిక సారూప్యత కారణంగా మసీహ్ పేరుతో శిలువ (క్రైస్తవ) విశ్వాసాన్ని రూపుమాపడానికి ఈ అల్పుడు పంపబడ్డాడు. కనుక నేను శిలువను విరగ్గొట్టడానికి, పందులను వధించడానికి పంప బడ్డాను. నా కుడి ఎడమల వైపున్న పరిశుద్ధ దైవదూతలతో నేను ఆకాశం నుండి దిగివచ్చాను." (ఫతహ్ ఇస్లాం-పేజి.9)

".....(హదీసులో చెప్పబడిన) ఆ అవతరణ భావం నిజానికి మసీహ్ ఇబ్నెమర్యం అవతరణ కాదు. అందులో ఉపమానంగా ఒక మసీహ్‌ని పోలిన మసీహ్ రాక గురించిన వృత్తాంతం తెలుపబడింది. దైవిక ప్రేరణ, ప్రకటనల (ఏలామ్ వ ఇల్హామె వహీ) ప్రకారం అది ఈ అల్పుడికే వర్తిస్తుంది." (తౌజీ మరామ్-పేజి.2)

హజ్రత్ మసీహ్ (అలైహి) ఆకాశంలో ఇంకా సజీవంగా ఉన్నారన్నది బుద్ధికందని విషయమని కొట్టిపారేస్తూ మిర్జాగులాం అహ్మద్ ఇలా అన్నాడు:

"హజ్రత్ మసీహ్ తన నశ్వర శరీరంతో సహా ఆకాశంపైకి చేరారని కాస్సేపు మాట వరసకు అనుకుంటే, యావత్తు జంతువుల, మానవుల శరీరాల మాదిరిగా ఆయన శరీరం కూడా కాలపరిస్థితుల వల్ల ప్రభావితమై ఎప్పుడో ఒక రోజు దానికి మరణం తప్పనిసరి అవుతుందని. అలాంటప్పుడు హజ్రత్ మసీహ్ తన జీవిత కాలాన్ని ముగించి ఆకాశంలోనే చనిపోయారని అంగీకరించవలసి ఉంటుంది. ఒకవేళ ఆయన ఇప్పటిదాకా జీవించి ఉన్నారనుకుంటే ఇంత సుదీర్ఘ కాలం గడిచిన తరువాత ఆయన కాళ్ళు పడిపోయి, ఎలాంటి ధర్మసేవ చేయడానికి ఆయన యోగ్యుడై ఉండరు అనడంలో సందేహం లేదు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోకి ఆయన పునరాగమనం వృథాప్రయాస తప్ప ఏ విధమైన ప్రయోజనకారి కాజాలదు." (ఇజాల ఔహాం - పే. 25,26)

ఈ విధంగా మిర్జా గులాం అహ్మద్ హజ్రత్ ఈసా (అలైహి) భౌతిక శరీరాన్ని మృత్యుకుహరంలోకి నెట్టివేశాడు. ఇప్పుడు ఆకాశంలో మసీహ్ ఆత్మ మాత్రమే ఉంది! ఆ'ఆత్మే' మిర్జాగారి దేహంలోకి చొచ్చుకొచ్చి ఆయన మసీహ్ అవతారం ఎత్తారట!!

"ఆయన (దేవుడు) బరాహీన్ అహ్మదియా మూడోభాగంలో నా పేరు మర్యం అని పెట్టాడు. తర్వాత బరాహీన్ అహ్మదియాలో తెలిపినట్లు రెండేళ్ళ దాకా నేను మర్యం నైజంలో పెంచబడ్డాను మరియు పరదాలో పెరుగుతూ వచ్చాను. మర్యంలో మాదిరిగా ఈసా ఆత్మను నాలో నింపడం జరిగింది. (తత్ఫలితంగా) ఉపమానం పంథాలో నేను గర్భధారణ గావించబడ్డాను (అంటే గర్భవతినయ్యాను). చివరికి పది మాసాలకు మించని అనేక నెలల



తరువాత బరాహీన్ అహ్మదియా నాల్గవ భాగంలో పేర్కొనబడ్డ కడపటి ఇల్హామ్ (దైవికప్రేరణ) ద్వారా నేను మర్యం నుంచి ఈసాగా రూపొందించబడ్డాను. కనుక ఈ విధంగా నేను ఇబ్నె మర్యం (మర్యం కుమారుడు) అయ్యాను." (కష్తియె నూహ్- పే. 46-మిర్జా గులాం అహ్మద్)

దీనిపై వ్యాఖ్య అనవసరం. స్థలాభావం, కాలయాపన తప్ప మరేమీ ఉండదు.

హజ్రత్ మసీహ్ (ఈసా) అలైహిస్సలాం రెండు పచ్చ వస్త్రాలు ధరించి, ఇద్దరు దైవదూతల రెక్కల మీద చేతులు ఉంచి డెమాస్కస్‌లోని ఓ శ్వేతస్థూపం వద్ద దిగుతారని హదీసులో వచ్చినట్లు మనం ఇంతకు ముందు పేరాల్లో తెలుసుకున్నాం. కాని మిర్జా గులాం అహ్మద్ వీటి అర్థాలను ఎలా తారుమారు చేశాడో చూడండి:

"దమష్క్ (డెమాస్కస్) అనే పదం యొక్క విశదీకరణ (Interpretation) గురించి దైవం తరపునుండి నాకీ విషయం తెలియజేయబడింది, ఆ ప్రాంతంలో యజీదీయ స్వభావం, యజీదీయ పైశాచిక అలవాట్లు, భావాలను అనుసరించే ప్రజలు ఉంటారు. వారి హృదయాల్లో దైవంపట్ల, (ఆయన ) ప్రవక్తపట్ల ఏ మాత్రం ప్రేమ ఉండదు, దైవాజ్ఞల యెడల గౌరవం ఉండదు..... అందువల్ల ఇలాంటి ప్రజల్లోనే మసీహ్ ప్రభవించాల్సిన అవసరం ఉంది." (ఇజాల ఔహాం-పే. 33,34)

" ఈ ప్రజలు యజీదీయ స్వభావస్థులని, ఈ ఊరు (ఖాదియాన్) దమష్క్‌ను పోలి ఉందని అప్పుడు ఆయన (దేవుడు) నాకు చెప్పాడు. కాబట్టి దేవుడు ఓ మహాకార్యం కోసం ఈ దమష్క్‌లో ఈ అల్లుడ్ని దించాడు." (ఇజాల ఔహాం-పే. 68)

"మసీహ్ రెండు వస్త్రాలు ధరించి అవతరిస్తారని హదీసుల్లో ప్రస్తావించబడిన ఆ రెండు పచ్చ ఉడుపులు నాలో లీనమయి ఉన్నాయి.

నిగూఢ జ్ఞానం ప్రకారం దీని గూఢార్థం రెండు వ్యాధులు. కావున ఒక బట్ట నా ఉపరిభాగాన ఉంది. అంటే నాకెప్పుడూ తలనొప్పి ఉంటుంది.. రెండవ బట్ట నా క్రింది భాగంలో ఉంది. అది డయాబటీస్ (అతి మూత్ర వ్యాధి)." (అరబియీన్-అనుబంధం)

మిర్జా గులాం అహ్మద్ శ్వేతస్థూపం గూఢార్థం చెప్పకుండా తన స్వస్థలం ఖాదియాన్‌లో ఏకంగా ఒక స్థూపాన్నే నిర్మించడానికి పూనుకున్నాడు. అయితే ఈ కోరిక ఆయన జీవితకాలంలో నెరవేరలేదు. ఆ తరువాత అతని అనుయాయులు ఈ నిర్మాణాన్ని పూర్తిచేశారు. దీని నిర్మాణం, నిర్మాణానికి చందాల వసూలు వగైరా విషయాలు సీరతుల్ మెహ్దిలో, వారి ఇతర పుస్తకాల్లో ప్రస్తావించబడ్డాయి.

హజ్రత్ మసీహ్ (అలైహి) ఇద్దరు దైవదూతల రెక్కల మీద చేతులు ఉంచి దిగుతారన్న హదీసుకు కూడా తనకు అనుకూలంగా ఉండేలా ఎలాంటి గూఢార్థాన్ని చెప్పలేదు మిర్జా. అయితే ఆ హదీసు భావాన్ని పరిహసిస్తూ ఇలా ఖండించాడు:

"మసీహ్ వచ్చి అడవుల్లో పందులను వేటాడుతూ తిరుగుతాడా? దజ్జాల్ కాబా ప్రదక్షిణ చేస్తాడా? మర్యం కొడుకు వ్యాధిగ్రస్తుడిలా ఇద్దరు మనుషుల భుజాల మీద చేతులు పెట్టి కాబాప్రదక్షిణ విధి నెరవేర్చుతాడా? ఈ హదీసులపై ఇజ్మా (సర్వసమ్మతి) నిరూపణ కాగలదా? గతంలో వీటికి భాష్యం చెప్పినవారు నిలువనీడ లేకుండా ఎలా ఊతకర్రలు పట్టుకొని తిరుగుతుండేవారో మీకు తెలియదా?" (ఇజాల ఔహామ్-పే.214)

హజ్రత్ మసీహ్ (అలైహి) పునరాగమనం, ఆయన చేత దజ్జాల్ వధించబడటం గురించి మిర్జా ఎలా దిగజారి మాట్లాడాడో చూడండి:

"సోదరులారా! ఈ వాదనకు సంబంధించిన రెండు కాళ్ళు ఉండేవి. ఒకటి, ఇబ్నె మర్యం అంతిమయుగంలో శరీరంతో సహా ఆకాశం నుండి



దిగడం. దివ్యఖుర్ఆన్, కొన్ని హదీసులు మసీహ్ ఇబ్నెమర్యం మరణించారని చెప్పి ఒక కాలును విరిచేశాయి. పోతే రెండవ కాలు దజ్జాల్ మౌవూద్ అంతిమ యుగంలో బయలెడుతాడనే సంగతికి సంబంధించినది. సహీ ముస్లిం, సహీ బుఖారీలలోని ప్రముఖ సహాబీల ఏకాభిప్రాయమున్న హదీసులు ఈ కాలును విరిచేశాయి. (అదేమిటంటే) ఇబ్నె సయ్యాద్‌ని దజ్జాల్ మౌవూద్‌గా పరిగణించి ముస్లింలు తమ సమాజంలో చేర్చుకొని హతమార్చారు. ఈవిధంగా ఈ వాదనకు చెందిన రెండు కాళ్ళూ విరిగిపోయి ఉంటే, ఇక 13 వందల ఏళ్ళు గడిచాక కాళ్ళులేని ఈ శవం ఇప్పుడు ఏ ఆధారంతో లేచి నిల్చుంటుంది?" (ఇజాల ఔహామ్-పే.133,134)

ఈ రెండు విషయాలు పూర్తిగా వక్ర భాష్యాలతో కూడుకున్నవని తెలుస్తూనే ఉంది. ఇబ్నె సయ్యాద్ పుట్టుక విశేషాలు, రూపురేఖలు దజ్జాల్‌ని పోలివుండటం చూసి మహాప్రవక్త (స) ఇతను దజ్జాల్ అయితే కాదు కదా అని భయపడ్డారు. ఆయన హజ్రత్ ఉమర్ (రజి)తో కలసి ఇబ్నెసయ్యాద్‌ని చూడటానికి పోయినపుడు హజ్రత్ ఉమర్ "నాకు అనుమతినివ్వండి, అతడ్ని హతమారుస్తాను" అని అన్నారు. కాని దైవప్రవక్త (స), "ఒకవేళ ఇతను 'అతనే' అయివుంటే ఇతడ్ని చంపేవాడివి నీవు కాదు, ఈసా ఇబ్నె మర్యం. 'అతను' కాకపోతే నీవు ఒక జిమ్మీని వధించడం ధర్మసమ్మతం కాదు" అని చెప్పి వారించారు. (మిష్కాత్-షరయిసున్న)

దజ్జాల్ గురించి దేవుడు మిర్జాగారికి తెలిపినంత వివరంగా మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)కు తెలియజేయలేదట! "ఇజాల ఔహామ్" అన్న తన గ్రంథంలో ఈ విషయాన్ని ఆయన అనేకసార్లు ప్రస్తావిస్తూ, "ఆన్ హజ్రత్ (దైవప్రవక్త ముహమ్మద్) సల్లల్లాహు అలైహి వసల్లంపై దజ్జాల్, ఇబ్నె మర్యంల వాస్తవ పరిస్థితి పూర్తిగా ప్రస్ఫుటం కాలేదు. దేవుడు ఆయనకు కేవలం సంక్షిప్త జ్ఞానం మాత్రమే ప్రసాదించాడు" అని అన్నారు.

గులాంఅహ్మద్ మొదట తాను దైవనియుక్తుణ్ణని, యుగసంస్కర్త (ముజద్దిద్)నని, మహ్దినని, మసీహ్ వంటి ఈసానని, తనకు మసీహ్ (అలైహి) సారూప్యతాభాగ్యం లభించిందని, ఆతర్వాత తానే అసలు మసీహ్ మౌవూద్‌నని, చివరికి దైవప్రవక్తనని చెప్పుకున్నాడు. అంతేకాదు ప్రవక్తలందరి అస్తిత్వాలు తన అస్తిత్వానికి చెందినవే అన్నట్లు కూడా చెప్పుకున్నాడు:

“ప్రపంచంలో ఎందరు దైవప్రవక్తలు గతించారో వారిలో ఏ ఒక్కరి పేరు కూడా నాకు పెట్టకుండా జరగలేదు. నేను ఆదంని, నేను నూహ్‌ని, నేను ఇబ్రాహీంని, నేను ఇస్‌హాఖ్‌ని, నేను యాఖూబ్‌ని, నేను ఇస్మాయీల్‌ని, నేను మూసాని, నేను దావూద్‌ని, నేను ఈసా ఇబ్నెమర్యంని, నేను ముహమ్మద్ (స)ని, అంటే, అవతారపరంగా అని బరాహీన్ అహ్మదియాలో దేవుడు అన్నాడు.” (హఖైఖతుల్ వహీ- పే. 84)

అంతకంటే ఆశ్చర్యకరం, హాస్యాస్పదమయిన విషయం ఏమిటంటే ఈయన గారు ఓ సందర్భంలో తాను కృష్ణుణ్ణని కూడా చెప్పుకున్నాడు. (చూడండి. సమాల్‌కోట్ ప్రసంగం తేది 2-11-1904, పేజ 34)

మసీహ్ మౌవూద్ (అలైహి) ఆకాశం నుండి దిగినప్పుడు ఆయన దైవప్రవక్త హోదాలో రారని, మర్యం కుమారుడు మసీహ్ (ఈసా)గా మాత్రమే వస్తారని లోగడ మనం చదివి ఉన్నాము. కాని ఈ మహానుభావుడు తాను దైవప్రవక్తనని, తనపై దైవసందేశం అవతరిస్తుందని ప్రకటించుకున్నాడు:

“నేను పలుమార్లు వివరించినట్లు నేను విన్పించే ఈ వాణి ఖుర్‌ఆన్, తౌరాత్‌ల మాదిరిగానే నిర్ద్వంద్వంగా, నిస్సందేహంగా దైవవాణి. నేను దేవుని జిలీ (ఛాయాగ్రహ) ప్రవక్తను (ముహమ్మద్ మహాభాగ్యంతో దైవసందేశాన్ని పొందే ప్రవక్తను) మరియు బరోజి (అవతార) పరమయిన ప్రవక్తను. మత వ్యవహారాల్లో నాపట్ల విధేయత కలిగిఉండటం ప్రతి ముస్లిం విధి (వాజిబ్).” (తొహ్‌ఫతుల్ నద్వా-మిర్జా గులాం అహ్మద్)



“దైవాజ్ఞననుసరించి నేను దైవప్రవక్తను” అని చనిపోవడానికి మూడు రోజుల ముందు మిర్జా గులాం అహ్మద్ ఒక ఉత్తరం రాశాడు.

(రివ్యూ ఆఫ్ రిలీజియన్స్, సంపుటి-3, సంచిక-14, పే.110లో చూడండి)

“ప్రవక్త అనే పదానికి ఇస్లామీయ షరీఅత్ ఏ అర్థం చెప్పిందో ఆ అర్థంలో ఆయనగారు సాదృశ ప్రవక్త (మజాజీనబి) ఎంతమాత్రం కాదు. ఆయన నిజమైన దైవప్రవక్తే.” (హఖైఖతున్నబువ్వత్-పే.174)

మహనీయ ముహమ్మద్ (సల్లం) అంతిమ దైవప్రవక్తని, ఆయన తరువాత మరో దైవప్రవక్త ప్రభవించడని సహాబీలతో సహా 13 శతాబ్దాల నుంచి యావత్ ముస్లింజగత్తు ఏకగ్రీవంగా విశ్వసిస్తోంది. అంతిమ దైవప్రవక్త అనే పదానికి సహాబీలు ఇదే భావమని గ్రహించినందునే ముహమ్మద్ (స)ని తదనంతరం దైవప్రవక్తనని చెప్పుకున్న ప్రతి దుర్మార్గుడిపై వారు యుద్ధం ప్రకటించి తత్సంబంధిత ఉపద్రవాల్ని అంతమొందించారు.

కాని మిర్జా సాహెబ్ మొదట్లో ముహమ్మద్ మహనీయుణ్ని (సల్లం) అంతిమ దైవప్రవక్త అని ఒప్పుకుంటూ కొత్త దైవదౌత్యాన్ని కొత్త దైవసందేశా (వహీ)న్ని తీవ్రంగా వ్యతిరేకించి, ఆ తరువాత దానికి విరుద్ధంగా తాను కూడా దైవప్రవక్తనని ప్రకటించుకుని ఇస్లాం ధర్మం మౌలిక విశ్వాసానికే ఎసరు పెట్టాడు. దాంతో అతని అనుచరులయిన ఖాదియానీలు “ఖాతమున్నబియ్యీన్” (ప్రవక్తల్లో అంతిమవాడు) అంటే ముహమ్మద్ ప్రవక్తల ముద్ర అని, ఆయన తరువాత వచ్చే ప్రతి ప్రవక్త యొక్క దైవదౌత్యం ఆయన (సల్లం) దౌత్యపు ధృవీకరణ ముద్రవేసుకొని ధ్రువపడిపోతుందని తప్పుడు వ్యాఖ్యానం చేసి నమ్ముతున్నారు. ఖుర్‌ఆన్‌లో (33:40) వచ్చిన ‘ఖాతమున్నబియ్యీన్’ అనే పదంలోని ఖాతమ లేక ఖతమ్ అనే దానికి మిర్జా గులాం అహ్మద్ ఎలా పెడర్థాలు తీస్తూ తన వాదనను బలపరచు కోవడానికి ప్రయత్నించాడో చూడండి:

'ఖాతమ్' అంటే ముహర్ (ముద్ర లేక సీలు) అని చెబుతున్నారు. దైవప్రవక్త (స) ముహర్ అయినపుడు, ఆయన అనుచరసమాజంలో మరె లాంటి దైవప్రవక్త ఉండడనుకుంటే ఆయన ముద్ర (ముహర్) ఎలా అయ్యారు? ముద్ర ఎవరిమీద పడ్తుంది?"(అఫ్జల్‌ఖాదియాన్, 22-5-1922)

"దైవప్రవక్త (సల్లల్లాహు అలైహి వసల్లం) 'ఖాతమన్నబియ్యీన్' కాదని మేము అనడం లేదు. కాని 'ఖతమ్' అంటే అధిక సంఖ్యాక ముస్లింలు విశ్వసిస్తున్నట్లు అంతిమ దైవప్రవక్త అని అర్థం కాదు. ఇది దైవప్రవక్త ముహమ్మద్ (సల్లం) ఔన్నత్యం, హోదా అంతస్థులకు పూర్తిగా వ్యతిరేకమైన భావం. ఈ భావన ద్వారా ఆయన తన అనుచర సమాజాన్ని తన దైవదౌత్య మహాభాగ్యానికి నోచుకోకుండా చేశారన్న విషయం స్ఫురిస్తుంది..." (అఫ్జల్ ఖాదియాన్, 22-9-1939)

"వారు (అంటే మహనీయ ముహమ్మద్-సల్లంని అంతమ దైవప్రవక్త అని విశ్వసిస్తున్న ముస్లింలు) దేవుని దగ్గరున్న నిక్షేపాలు అంతమయి పోయాయని భావిస్తున్నారు. దేవుని గౌరవోన్నత్యాలను అర్థం చేసుకోక పోవడం వల్లనే వారీ విధంగా భావిస్తున్నారు. నేను మాత్రం ఒక ప్రవక్తేమిటీ, వేలాదిమంది ప్రవక్తలు ప్రభవించగలరని అంటాను." (అన్వారె ఖిలాఫత్, రచన: మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అహ్మద్-పే.62)

## అంతిమ దైవదౌత్యం-4

అరబీ భాషలో 'ఖతమ్' అంటే సీలువేయడం, ముద్రవేయడం, మూసి వేయడం, ముగించడం, పూర్తిచేయడం, అంతంచేయడం అని అర్థాలు ఉన్నాయి. ఒక పాత్రలో ఏదైనా పదార్థాన్ని ఉంచి ఆ పదార్థం బయటికి పోకుండా, మరో పదార్థం ఆ పాత్రలో చొరబడకుండా ఉండేందుకు దాన్ని మూతతో మూసివేయడం; ఉత్తరాన్ని కవర్‌లో పెట్టి మూసేసి భద్రంగా



ఉండేందుకు దానికి సీలువేయడం; ఒక తెగలోని కడపటి వ్యక్తి -వగైరా లాంటి అరబీ భాష వాక్యాల్లో "ఖతమ్" అనే పదాన్ని వాడతారు.

అయితే ఖాదియానీలు అన్నట్లు ఈ వాక్యాల్లోని మూసేసిన పాత్రలో మరో పదార్థాన్ని చేర్చవచ్చు అని, సీలువేసిన కవర్‌లో మరో ఉత్తరాన్ని జొప్పించవచ్చని లేదా దాని ముద్రతో మరెన్ని ఉత్తరాలైనా చెలామణి అవుతాయని, ఒక తెగ యొక్క కడపటి వ్యక్తి గతించిన తరువాత కూడా అతని తెగ సంబంధితమైన ముద్రతో ఇతర వ్యక్తులు సైతం ఆ తెగకే చెందినవారయి ఉండవచ్చని ఎంత మాత్రం అర్థం కాదు. నేటికీ అరబీ భాషలో ఇలాంటి వాక్యాలను ఈ అర్థాల్లో ఎవరూ ప్రయోగించరు.

ఈ పదం ఉన్న దైవసూక్తి, దాని పూర్వాపరాలు ఏమిటో ఓసారి పరిశీలిద్దాం.

పూర్వం అరేబియాలో పెంపుడు కొడుక్కు అన్ని విధాలా కన్న కొడుకు స్థానమిచ్చే దురాచారం ఉండేది. మహనీయ ముహమ్మద్ (సల్లం) అంతిమ దైవప్రవక్తగా ఈ దురాచారాన్ని కూడా శాశ్వతంగా అంతమొందించడానికి, దైవాజ్ఞతో తన పెంపుడు కొడుకు (జైద్ బిన్ హారిసా) చేత గత్యంతరంలేని పరిస్థితిలో అతని భార్య (జైనబ్ బిన్తె హజష్)కు విడాకులిప్పించి ఆమెను తన వివాహబంధంలోకి తీసుకున్నారు. అప్పుడు కపట విశ్వాసులు దీన్ని సువర్ణావకాశంగా తీసుకొని, ముహమ్మద్ (సల్లం) కోడలు వరుసయిన జైనబ్ (రజ)ని నిర్లజ్జగా పెళ్ళి చేసుకున్నారని దుష్ప్రచారం ప్రారంభించారు. ఆ సందర్భంలో ఈ క్రింది ఖుర్‌ఆన్ సూక్తులు అవతరించాయి:

"ప్రవక్తా! జ్ఞాపకం తెచ్చుకో. దేవుడు, నీవు (ఇద్దరూ కలసి) మేలు చేసిన ఒక వ్యక్తితో నీవు 'దేవునికి భయపడు, నీభార్యను వదలిపెట్టకు' అన్నావు నీవు. ఆ సమయంలో నీవు ఒక విషయాన్ని మనసులో దాచి ఉంచావు. దాన్ని దేవుడు బహిర్గతం చేయదలిచాడు. నీవప్పుడు లోకులకు

భయపడుతూ ఉండేవాడివి. నిజానికి దేవునికి మాత్రమే నీవు భయపడాలి. జైద్ తన భార్య దగ్గర అవసరాన్ని తీర్చుకున్న తరువాత (విడాకులిప్పించి) మేము ఆమెతో నీ వివాహం జరిపించాము. పెంపుడు కొడుకులు తమ భార్యల దగ్గర తమ అవసరాన్ని తీర్చుకున్న తరువాత వారి భార్యల (ను పెళ్ళాడే) విషయంలో ఎలాంటి ఇబ్బంది ఏర్పడకుండా ఉండాలనే మేమిలా చేశాము. దేవుని ఆజ్ఞ అమలు జరిగే తీరవలసి ఉంది.'' (33:37)

"(ప్రజలారా!) ముహమ్మద్ (సల్లం) మీ పురుషులలో ఎవరికీ తండ్రి కాదు. ఆయన దేవుని సందేశహరుడు, దౌత్యపరంపరను అంతమొందించిన అంతిమ దైవప్రవక్త. దేవుడు సమస్త విషయాలు ఎరిగినవాడు." (33:40)

పై సూక్తుల ద్వారా ఆరు విషయాలు స్పష్టమవుతున్నాయి:

(1) ఈ వివాహం దేవుని ఆజ్ఞతో జరిగింది.

(2) పెంపుడు కొడుకు ఎన్నటికీ కన్నకొడుకు కాలేడు. కనుక పెంపుడు కొడుకు విడాకులిచ్చిన స్త్రీని దైవప్రవక్త (సల్లం) వివాహమాడటంలో ఎలాంటి తప్పు లేదు.

(3) దురాచారాలను రూపుమాపడానికి సమాయత్తమయినప్పుడు దైవప్రవక్త (సల్లం) దేవునికి మాత్రమే భయపడాలి, లోకులకు భయ పడకూడదు.

(4) ముహమ్మద్ (సల్లం) ఎవరికీ తండ్రి కాదు. అంటే ఆయనకు కొడుకులే లేరు. కొడుకులే లేనప్పుడు, విడాకులు పొందిన కోడలిని వివాహమాడే ప్రసక్తే రాదు.

(5) ఆయన దేవుని ప్రవక్త కనుక, దైవప్రవక్తగా అనాదిగా వస్తున్న దురాచారాన్ని తప్పనిసరిగా అంతమొందించి, దాన్ని ధర్మ సమ్మతమైన పనిగా చేయవలసి ఉంది.



(6) ఆయన దౌత్యపరంపరను అంతమొందించిన అంతిమ దైవప్రవక్త. అంటే, ఈ దురాచారాన్ని అంతమొందించడానికి ప్రళయం దాకా మరో దైవప్రవక్త వచ్చే అవకాశం లేదు గనక అంతిమ దైవప్రవక్తగా మహనీయ ముహమ్మద్ (సల్లం) ఈ దురాచారాన్ని కూకటి వేళ్ళతో సహా పెకలించి ఈ సమస్యకు శాశ్వతంగా తెర దించవలసి ఉంది.

ఇక మహనీయ ముహమ్మద్ (సల్లం) వివిధ సందర్భాలలో బోధించిన ప్రవచనాలు కూడా వినండి:

"ఇస్రాయీలీలకు దైవప్రవక్తలు నేతృత్వం వహిస్తుండేవారు. (వారిలో) ఒక ప్రవక్త చనిపోతే ఆయనకు మరో ప్రవక్త వారసుడవుతుండేవాడు. కాని నా తరువాత ఏ ప్రవక్తా ఉండడు ఖలీఫాలు తప్ప.'' (బుఖారి)

"రిసాలత్, నబువ్వత్‌ల (దైవదౌత్యాల) పరంపర అంతమైపోయింది. ఇక నా తరువాత ఏ రసూల్ (దైవసందేశహరుడు)గాని, ఏ నబీ (దైవప్రవక్త) గాని ప్రభవించడు." (తిర్మిజీ)

"దేవుడు దజ్జాల్ గురించి తన అనుచర సమాజాన్ని భయపెట్టని ఏ ప్రవక్తనూ ప్రభవింపజేయలేదు. (అంటే దేవుడు పంపిన ప్రతి ప్రవక్తా తన అనుచర సమాజాన్ని దజ్జాల్ గురించి భయపెట్టినవాడే. అయితే ఆ ప్రవక్తల కాలాల్లో దజ్జాల్ పుట్టలేదు) ఇప్పుడు నేను అంతిమ దైవప్రవక్తను. మీరు చిట్టచివరి అనుచర సమాజం. కనుక దజ్జాల్ మీలోనే బయలెడవలసి ఉంది.'' (ఇబ్నెమాజ)

"నా తదనంతరం మరే దైవప్రవక్తా ప్రభవించడు. శుభవార్తలను తెలిపేవారు మాత్రమే వస్తారు.'' ప్రవక్త అనుచరులు ఈ మాట విని "శుభవార్తలు అంటే ఏమిటి?'' అని అడిగారు. దానికి దైవప్రవక్త (సల్లం) "మంచి కలలు" అన్నారు. (అంటే దైవప్రవక్త, దివ్యావిష్కృతుల అవతరణకు

ఇక ఏమాత్రం అవకాశం లేదన్నమాట. కాకపోతే దేవుని తరఫున ఎవరికైనా మంచి కలల ద్వారా మాత్రమే ఏదైనా సూచన లభిస్తుంది.).

(ముస్నద్ అహ్మద్, నసాయి, అబూదావూద్)

"నా తదనంతరం ఎవరైనా దైవప్రవక్త అయ్యే అవకాశం ఉంటే అతను ఉమర్ బిన్ ఖత్తాబ్ అవుతాడు." (తిర్మిజి)

మహాప్రవక్త (స) హజ్రత్ అలి (రజి)తో ఇలా అన్నారు: "నాతో నీకున్న సంబంధం మూసా (అలై)తో హారూన్ (అలై) కున్న సంబంధం లాంటిదే. అయితే నా తదనంతరం మరే దైవప్రవక్తా లేడు." (బుఖారి, ముస్లిం)

"నాకు, నాకు పూర్వం వచ్చిపోయిన దైవప్రవక్తలకు సంబంధించిన పోలిక ఎలాంటిదంటే ఒక వ్యక్తి ఎంతో అందమైన ఓ భవనాన్ని నిర్మించాడు. కాని ఓ మూలలో ఒక ఇటుక పట్టేంత ఖాళీ వదలిపెట్టాడు. జనం ఆ భవనం చుట్టూ తిరిగిచూస్తూ దాని అందచందాలను గురించి ప్రశంసించేవారు. అయితే (ఆ మూలలో ఉన్న ఖాళీని చూసి) 'ఇక్కడ ఇటుక ఎందుకు పెట్టలేదు?' అని అన్నారు. కనుక ఆ ఇటుకను నేనే. నేను ప్రవక్తల పరంపరను అంతమొందించే అంతిమ దైవప్రవక్త (ఖాతమున్నబియ్యీన్)ను. (అంటే నా రాకతో దౌత్య సౌధం పరిపూర్ణమయింది. ఇక ఈ సౌధానికి దైవదౌత్యమనే ఎలాంటి ఇటుకా అవసరం లేదు)." (బుఖారి)

"నా అనుచర సమాజంలో ముప్పయిమంది అసత్యవాదులు పుడ్తారు. వారిలో ప్రతి ఒక్కడూ తాను (కూడా) దైవప్రవక్తనని ప్రకటించుకుంటాడు. వాస్తవానికి నేను మాత్రమే అంతిమ దైవప్రవక్తను. నా తరువాత మరే దైవప్రవక్తా లేడు." (అబూదావూద్)

మహాప్రవక్త (సల్లం) దివంగతులయిన వెంటనే తమను తాము దైవప్రవక్తలని ప్రకటించుకున్న అసత్య ప్రవక్తలకు, వారిని నమ్మిన బూటకపు



ముస్లింలకు వ్యతిరేకంగా సహాబీలు (ప్రవక్త అనుచరులు) అంతా ఏకమయి యుద్ధం చేశారు. ముఖ్యంగా 'ముసైలిమా కజ్జాబ్' వ్యవహారం ఈ సందర్భంగా పేర్కొనదగినది. ఇతను ముహమ్మద్ ప్రవక్త (సల్లం) దౌత్యాన్ని నిరాకరించలేదు. తనను దైవదౌత్యంలో ముహమ్మద్ (సల్లం)తో పాటు భాగస్వామిగా చేయడం జరిగిందన్నదే అతని వాదన. అయినప్పటికీ అతడ్ని, అతని అనుచరుల్ని అవిశ్వాసులు (కాఫిర్లు)గా పరిగణించి ముస్లిం సమాజం నుండి బహిష్కరించడం జరిగింది. పైగా వారందర్నీ కడతేర్చి, ఈ ఉపద్రవాన్ని శాశ్వతంగా అంతమొందించడం జరిగింది.

ముసైలిమా, అతని అనుచరులు మత భ్రష్టులైనందువల్ల కాకుండా తిరుగుబాటు చేసినందుకు వారిపై యుద్ధం చేశారని ఖాదియానీలు అంటారు. ఇది వాస్తవాన్ని వక్రీకరించడమే. ఇస్లామీయ చట్టం ప్రకారం తిరుగుబాటు నేరానికి పాల్పడిన ముస్లిం విద్రోహులతో యుద్ధం చేయవలసి వస్తే, యుద్ధఖైదీలుగా పట్టుబడినవారిని బానిసలుగా చేసుకోవడం జరగదు. అలాగే ఇస్లామీయ రాజ్యంలోని ముస్లిమేతరులు సయితం తిరుగుబాటుకు పాల్పడి యుద్ధ ఖైదీలుగా పట్టుబడినప్పుడు వారిని కూడా బానిసలుగా చేయడం ఇస్లామీయ చట్టం ప్రకారం ధర్మసమ్మతం కాదు.

దీనికిభిన్నంగా ముసైలిమా, అతని అనుచరులపై దాడి జరిగినప్పుడు అప్పటి ఖలీఫా హజ్రత్ అబూబకర్ సిద్దీఖ్ (రజి) ఒక ప్రకటన చేస్తూ, యుద్ధఖైదీలుగా పట్టుబడినవారి స్త్రీలను, పిల్లలను బానిసలుగా చేసుకోవాలని అన్నారు. ఇస్లాంచట్టం ప్రకారం ఇది మతభ్రష్టుల పట్ల అవలంబించవలసిన వైఖరి. అంటే ముసైలిమా, అతని అనుచరులు ఓ బూటకపు దైవదౌత్యానికి తెరలేపి మతభ్రష్టులయ్యారన్నమాట.

ఇమామ్ అబూ హనీఫా (రహ్మలై) (హిజ్రీ 80-150), అల్లామా ఇబ్నె జరీర్ తబ్రి (హిజ్రీ 224-310), అల్లామా ఇబ్నె హిజమ్ ఇందులసి (హిజ్రీ

384-456), ఇమామ్ గజాలి (హిజ్రీ 450-505), ముహియుస్సున్నబగవి (హిజ్రీ 510), అల్లామా జమ్‌ఖష్రి (హిజ్రీ 467-538), ఖాజీ అయాజ్ (హిజ్రీ 544), అల్లామా షహర్ సతాని (హిజ్రీ 548), ఇమామ్ రాజి (హిజ్రీ 543-606), అల్లామా బైజావి (హిజ్రీ685), అల్లామా హాఫిజుద్దీన్ (హిజ్రీ 710), అల్లామా అలావుద్దీన్ బగ్దాది (హిజ్రీ 735), అల్లామా ఇబ్నె కసీర్ (హిజ్రీ 774), అల్లామా జలాలుద్దీన్ సైవతి (హిజ్రీ 911), అల్లామా ఇబ్నె నుజీమ్ (హిజ్రీ 970), ముల్లా అలి ఖారి (హిజ్రీ 1016), షేఖ్ ఇస్మాయిల్ హఖీ (హిజ్రీ 1137), అల్లామా షూకాని (హిజ్రీ 1255), అల్లామా ఆలూసి (హిజ్రీ 1270) వగైరా ప్రాచీన ధర్మవేత్తలు, పండితులు తమతమ వ్యాఖ్యాన సహిత ఖుర్‌ఆన్, ఫిఖహ్ తదితర గ్రంథాలలో మహనీయ ముహమ్మద్ (సల్లం) దౌత్య పరంపరను సమాప్తం చేసిన అంతిమ దైవప్రవక్త అని, ఆయన తరువాత మరే దైవప్రవక్తా లేడని, ఒకవేళ ఎవరైనా తనను తాను దైవప్రవక్తనని, తనపై కూడా దైవసందేశం అవతరిస్తోందని, తాను మసీహ్ మౌవూద్‌నని ప్రకటించుకుంటే అతడ్ని అవిశ్వాసిగా, అబద్ధాలరాయుడిగా పరిగణించడం జరుగుతుందని స్పష్టంగా చెప్పారు.

హిజ్రీ 12వ శతాబ్దంలో ఔరంగజేబ్ ఆలమ్‌గీర్ ఆదేశంతో మన దేశంలోని ప్రముఖ ధర్మవేత్తలు అనేకమంది కలసి ''ఫతావా ఆలమ్‌గీర్'' పేరుతో ఓ గొప్ప గ్రంథాన్ని రాశారు. అందులో, మహనీయ ముహమ్మద్ (సల్లం)ని అంతిమ దైవప్రవక్తగా విశ్వసించనివాడు ముస్లిం కాలేడని, ఎవరైనా తనను తాను దైవప్రవక్తనని చెప్పుకుంటే అతడ్ని అవిశ్వాసిగా పరిగణించడం జరుగుతుందని పేర్కొనబడింది.

## అవాకులు - చవాకులు-5

ఇలా మహనీయ ముహమ్మద్ (సల్లం) తాను చివరి దైవప్రవక్తనని, తన తదనంతరం మరే దైవప్రవక్త ప్రభవించడని చెప్పిన అనేక హదీసులు, వాటిని సమర్థిస్తూ ముస్లిం జగత్తులోని ప్రముఖ ధర్మవేత్తలంతా రాసిన అనేక గ్రంథాలు ఉన్నాయి. కాని ఖాదియానీలు వీటి జోలికి పోకుండా ''నేను ఆఖరి ప్రవక్త (ఆఖరల్ అంబియా)ను, నా మస్జిద్ ఆఖరి మస్జిద్ (ఆఖరల్ మసాజిద్)'' అని చెప్పిన హదీసును మటుకు పట్టుకొని (మదీనాలోని) ''ప్రవక్త మస్జిద్''ని ఆఖరి మస్జిద్ అన్నంత మాత్రాన దాని తరువాత ప్రపంచంలో మస్జిద్‌లు నిర్మించబడలేదా, అలా నిర్మించబడటం దైవప్రవక్త ప్రవచనానికి వ్యతిరేకమా అని ప్రశ్నిస్తూ తమ వక్రబుద్ధిని చాటుకుంటారు.



మస్జిదె నబవీకి సంబంధించిన వివిధ హదీసులను ఒకసారి పరిశీలిస్తే అంతిమ దైవప్రవక్త (సఅసం), ''ఈ మస్జిద్''కు ఇచ్చిన ప్రత్యేక ప్రాముఖ్యం ఏమిటో తెలిసిపోతుంది. ప్రపంచంలోని ఇతర మస్జిద్‌లలో చేసే నమాజ్ కన్నా కాబాగృహం, అఖ్సామస్జిద్, మస్జిదె నబవీలలో చేసే నమాజ్‌కు అత్యధిక పుణ్యం లభిస్తుంది. కేవలం నమాజ్ చేయడానికి వేల మైళ్ళ దూరమైనా ఈ మూడు మస్జిద్‌లను చేరుకోవడానికి ప్రయాణం చేయడం ధర్మసమ్మతం చేయబడింది. ఈ విషయాలు తెలిసినప్పటికీ ఖాదియానీలు మిర్జా గులాం అహ్మద్ ఇచ్చిన శిక్షణతో వితండవాదానికి దిగుతారు.

మిర్జా గులాం అహ్మద్ ప్రవక్తనని ప్రకటించుకోవడమే గాక, హద్దులు మీరిన ఆధిక్యతాభావంతో తాను మహాప్రవక్త ముహమ్మద్ (సల్లం)ని, ఈసా ప్రవక్త (అలైహి)ను కూడా మించిపోయినట్లు గొప్పలు చెప్పుకున్నాడు, ఆ విషయాల్ని గురించి కూడా వినండి:

''దేవుడు ఇరవై యేళ్ళ క్రితం ‘ బరాహీన్ అహ్మదియా’ (గ్రంథం)లో నా పేరు ముహమ్మద్ అని, అహ్మద్ అని పెట్టాడు; నన్ను ఆన్ హజ్రత్ (మహాప్రవక్త) సల్లల్లాహు అలైహి వ సల్లం అస్తిత్వంగానే పరిగణించాడు.'' (ఏక్ గల్తీకా ఇజాల)

“ఏక్ గల్తీకా ఇజాలా (అనే ప్రకటన)లో నేను (అంటే) హజ్రత్ మసీహ్ మౌవూద్ ఇలా ప్రవచించారు: ముహమ్మదుర్రసూలుల్లాహి వల్లజీన మఅహూ అషిద్దావు అలల్ కుఫ్ఫారి రుహమావు బైనహుమ్ (ఖుర్ఆన్-48:29) యొక్క ఇల్హామ్‌లో ముహమ్మద్ రసూలుల్లాహ్ అంటే నేనే. నన్ను ఉద్దేశించే దేవుడు ముహమ్మద్ రసూలుల్లాహ్ అన్నాడు.” (అల్ ఫజల్ పత్రిక, ఖాదియాన్-15-7-1905)

“జిలీ నబువ్వత్ (ఛాయాగ్రహ దైవదౌత్యం) మసీహ్ మౌవూద్‌ని వెనుకంజవేయనీయ లేదు. పైగా అది ఆయన్ని మరింత ముందుకే పురోగమింపజేసింది. అలా పురోగమింపజేసి చివరికి నబీ కరీం (ముహమ్మద్ ప్రవక్త- సల్లం) సరసన తెచ్చి నిలబెట్టింది.” (కలిమతుల్ ఫసల్-రివ్యూ ఆఫ్ రిలీజియన్స్-పే. 113, నెం.3, సం.14)

“అతని (మహాప్రవక్త-సల్లం) కోసం చంద్రగ్రహణ సూచన బహిర్గత మయింది. (కాని) నా కోసం సూర్య చంద్రగ్రహణాల సూచనలు రెండూ బహిర్గతమయ్యాయి. ఇక ఇప్పుడూ నీవు నిరాకరిస్తావా?” (ఏజాజ్ అహ్మద్-పే.71)

“ఇబ్నె మర్యం సంగతి వదిలెయ్యండి. అతని కంటే (ఈ) గులాం అహ్మద్ మిన్న.” (దాఫ అల్‌బలా-పే.20)

“ఏసు చేతిలో దగా, మోసాలు తప్ప మరేమీ లేవు. అలాంటి వ్యక్తిని ఈ తెలివిమాలిన క్రైస్తవులు దేవునిగా చేసుకోవడం ఎంతటి విచారకరమైన విషయం! ఆయన గారి వంశం ఎంత పవిత్రమైనది!! ముగ్గురు నాయనమ్మలు, అమ్మమ్మలు వేశ్యలు, వ్యభిచారిణులు. అలాంటి స్త్రీల రక్తం నుండి ఆయనగారి అస్తిత్వం ఆవిర్భవించింది.” (జమీమా అంజామె ఆథమ్-పే.7,నూరుల్ ఖుర్ఆన్ 2-పే.12)



మహాప్రవక్త (సల్లం) ప్రవచనం ప్రకారం నిజమైన విశ్వాసి ఎన్నటికీ నోరు పారేసుకోడు. దూషణలకు దుర్భాషలకు పాల్పడలేడు. కఠినంగా మాట్లాడడు. (తిర్మిజి)

అలాగే కపట విశ్వాసి ఎవరితోనయినా జగడానికి దిగితే వెంటనే తిట్లకు, బూతులకు పాల్పడతాడు. (బుఖారీ, ముస్లిం)

కాని, మిర్జా గులాం అహ్మద్ తనను నమ్మని వారిని ఓ సాధారణ ఉత్తమ ముస్లిం స్థాయికి సయితం తగని విధంగా ఎలా దూషించడానికి సిద్ధమయ్యాడో చూడండి:

“నన్ను వ్యతిరేకించేవాడు క్రైస్తవుడు, యూదుడు, బహుదైవా రాధకుడు, నరకనివాసి అవుతాడు.” (నుజూలె మసీహ్-పే.4)

“ఎవరైనా మా విజయానికి అడ్డు తగిలితే అతను అక్రమ సంతానం గా తయారవ్వడానికి ఉత్సాహపడుతున్నాడని భావించబడుతుంది.” (అన్వారుల్ ఇస్లాం- పే.30)

“ముస్లిములందరూ నన్ను ఒప్పుకున్నారు; నా సందేశాన్ని ధ్రువ పరిచారు. కాని వేశ్యలు, వ్యభిచారుల సంతానం మాత్రం నన్ను నమ్మలేదు.” (అయినాయె కమాలాత్- పే.547)

“నిస్సందేహంగా మన శత్రువులు ఎడారి పందులయిపోయారు. వారి స్త్రీలు కుక్కలకన్నా మించిపోయారు (నికృష్టులయ్యారు).” (నజ్మూల్ హుదా-పే.10)

ఇవీ దైవప్రవక్తనని చెప్పుకున్న మిర్జాగారి అమృతవాక్కులు! ఆలోచించండి. ఒక దైవప్రవక్త నోట ఆశించాల్సిన పలుకులేనా ఇవి? దివ్యఖుర్ఆన్‌లో దైవప్రవక్తలు ఎవరైనాసరే తమను విశ్వసించని వారి విషయంలో ఇలాంటి హేయమైన మాటలను ప్రయోగించారా??

దైవప్రవక్తనని ప్రకటించుకున్న మిర్జా గులాం అహ్మద్ తనను వ్యతిరేకిస్తున్న ధర్మవేత్తలను ఉద్దేశించి, హజ్రత్ ఈసా (అలైహి) విషయంలో ఎలాంటి మాటలు అన్నాడో చూడండి:

"మౌల్వీ మహాశయులారా! సాధారణంగా మసీహ్ మరణం సంగతి ఖుర్ఆన్ ద్వారా రుజువవుతుంటే, అనాది నుండి నేటి వరకు సహాబీలు, భాష్యకారుల అభిప్రాయాలు కూడా ఆయన్ని చంపుతూనే వస్తుంటే, మీరు అన్యాయంగా ఇలా మొండికేస్తారెందుకు? కాస్త క్రైస్తవుల దేవుణ్ణి కూడా చావనివ్వండి. ఎంతకాలం మీరిలా ఆయన జీవించే ఉన్నారని చెబు తుంటారు? దానికి ఒక హద్దంటూ లేదా?" (ఇజాల ఔహామ్-పే. 235)

"దుర్జాతి వర్గం మౌల్వీలారా! మీరు ఎంతకాలం ఇలా సత్యాన్ని దాచి ఉంచుతారు? మీరు యూద ప్రవృత్తిని విడనాడే సమయం ఎప్పుడొస్తుంది? దుర్మార్గపు మౌల్వీలారా! మీరు ఏ విశ్వాసరాహిత్య మధువుని గ్రోలారో అదీ ప్రజలకు కూడా త్రాగించారు. ఎంతటి విచారకరమైన విషయమిది!" (అంజామె ఆథమ్ పాద సూచిక-పే.21)

"ప్రపంచంలోని జీవరాసులన్నిటిలో పంది మురికి మలినాలతో కూడిన అసహ్యకరమైన జీవి. అయితే తమ మనోవాంఛల పరిపుష్టి కోసం సత్యం, నిజాయితీలకు సంబంధించిన సాక్ష్యాన్ని దాచేవారు పంది కంటే కూడా ఎంతో అసహ్యించుకోదగినవారు. ముర్దార్ వస్తువుల్ని తినే మౌల్వీలారా! దుర్గంధపూరితులారా!! నా పట్ల ఉన్న శత్రుభావంతో మీరు ఇస్లాం గురించిన నిజసాక్ష్యాన్ని దాచుతున్నారు. ఎంత విచారకరమైన విషయమిది. చీకటిలో తచ్చాడే పురుగుల్లారా! తేజోవంతమైన సత్యతాకిరణాలను ఎందుకు దాస్తున్నారు?" (అంజామె ఆథమ్ అనుబంధం- పే.21 పాదసూచిక)

మిర్జా గులాం అహ్మద్ దుర్భాషణతో చిర్రెత్తిపోయిన సయ్యిద్ కరీముద్దీన్ అనే ఒక వ్యక్తి 1903లో అతని మీద పరువునష్టం దావా వేశాడు.



అయితే కోర్టు మిర్జాకు అనుకూలంగా తీర్పిచ్చింది. దాంతో మిర్జా గులాం అహ్మద్ బరితెగించి సయ్యిద్ కరీముద్దీన్‌ని మరింత తీవ్రంగా దూషిస్తూ, ఒక వ్యాసం రాశాడు. కరీముద్దీన్ పచ్చి అబద్ధాలరాయుడని, పరమనీచుడని అన్నాడు. సయ్యిద్ కరీముద్దీన్ మళ్ళీ అతనిపై పరువునష్టం దావా వేశాడు. న్యాయస్థానం మిర్జా గులాం అహ్మద్‌ని గురుదాస్‌పూర్‌కు రప్పించి అయిదొందల రూపాయలు జరిమానా విధించింది. మిర్జా వెంటనే అమృత్‌సర్ కోర్టుకు అప్పీలు చేసుకున్నాడు. అక్కడి న్యాయాధికారి ఆంగ్లేయుడయినందున క్రిందికోర్టు ఇచ్చిన తీర్పును కొట్టిపారేస్తూ, మిర్జా గులాం అహ్మద్‌కు అనుకూలంగా తీర్పిచ్చాడు.

## పారని భవిష్యత్ ప్రకటనలు-6

మిర్జా గులాం అహ్మద్ ఖాదియానీ తన బూటకపు దైవదౌత్యాన్ని సమర్థించుకోవడానికి కొన్ని భవిష్యత్ ప్రకటనలు కూడా చేశాడు. కాని వాటిలో ఏ ఒక్కటీ నిజం కాలేదు. అయినప్పటికీ మిర్జా మరణానంతరం అతని శిష్యులు ఆ భవిష్యత్ ప్రకటనలకు వక్రభాష్యాలు చెబుతూ తృప్తి చెందుతున్నారు.

డిప్టీ ఆథమ్ అనే ఓ క్రైస్తవ ఫాదరీతో మిర్జా ఖాదియానీ పదిహేను రోజులపాటు వాదించాడు. చివరికి ప్రత్యర్థి ఏమాత్రం వెనక్కి తగ్గక పోవడంతో మిర్జా గులాం అహ్మద్ దేవుని నిర్ణయమని చెబుతూ, "ఉభయుల్లో ఎవరు అసత్యవాదో అతను ఈ రోజునుండి (అంటే 5-6-1893 నుండి) పదిహేను నెలల్లోగా నరకంలో పడవేయబడతాడు" అని అన్నాడు. ఆ తరువాత "ఈ భవిష్యత్ ప్రకటన గనక అబద్ధమని తేలితే, దేవుని దృష్టిలో అసత్యం పక్షాన ఉన్న ఆ వ్యక్తి ఈ రోజు నుండి పదిహేను నెలల్లోగా మరణం ద్వారా నరక కూపంలో పడనిపక్షంలో నేను ఎలాంటి శిక్షకయినా గురికావడానికి సిద్ధంగా ఉన్నాను. నేను అవమాన

పరచబడేందుకైనా, నా ముఖం నల్లగా చేయబడేందుకైనా, నా మెడలో త్రాడుకట్టి వేసేందుకైనా, నేను ఉరిశిక్షకు గురికావడానికైనా, మరి దేనికైనా నేను సిద్ధంగా ఉన్నాను" అని ప్రకటించాడు.

నిర్ణీతకాలం సమీపిస్తున్న కొద్దీ మిర్జా శిష్యగణంలో ఆశ, ఆతురతలు ద్విగుణీకృతం కాసాగాయి. "దైవసాక్ష్యం! దేవుడు తప్పకుండా ఇలా చేస్తాడు, తప్పకుండా ఇలా చేస్తాడు. భూమ్యాకాశాలు తప్పవచ్చుగాని దేవుని మాట తప్పదు" అని మిర్జా చెప్పిన మాటలను పూర్తిగా నమ్మిన అతని అనుచరులు డిప్టీ ఆథం నిర్ణీత గడువులోగా తప్పకుండా చనిపోతాడని గంపెడు ఆశలు పెట్టుకొని ఎదురు చూడసాగారు.

నిరీణత గడువుకు ఒక్క రాత్రి మాత్రమే మిగిలిఉంది. మిర్జా శిబిరంలోని స్త్రీలు, పురుషులు, పిల్లల్లో కలకలం బయలుదేరింది. ఆ రాత్రి అందరూ మేల్కొని డిప్టీ ఆథం చావు కోసం ప్రార్థనలు చేశారు. సూర్యోదయానికి ముందే అతని ప్రాణాలు అనంత వాయువుల్లో కలసి పోతాయని ఎంతో నమ్మకం పెట్టుకున్నారు. ఆథంను చంపడానికి మిర్జా గులాం అహ్మద్ శాపనార్థాలు కూడా పెట్టాడు; శెనగలు మంత్రించి పాడుబడ్డ బావిలో వేయించాడు. కాని మిర్జా ఎన్ని తంత్రాలు చేసినా, మరెన్ని శాప నార్థాలు పెట్టినా దేవుడు డిప్టీ ఆథంని చావనీయ లేదు. మిర్జా చెప్పిన భవిష్యత్ ప్రకటన దేవుని వైపు నుండి వెలువడిన భవిష్యత్ ప్రకటన కాదని రుజువయింది. అతను బూటకపు దైవప్రవక్తని, పచ్చి అబద్దాల రాయుడని తేలిపోయింది.

1886, ఫిబ్రవరి 20న మిర్జా గులాం అహ్మద్ తనకు అసామాన్య శక్తిగల, పరిశుద్ధుడయిన ఓ కొడుకు పుడ్తాడని, అతని పేరు బషీర్ అని దేవుడు తెలిపినట్లు ఒక ప్రకటన చేశాడు. అతను భవిష్యత్తులో అసాధారణ మైన ఘనకార్యాలు చేస్తాడని కూడా చెప్పుకున్నాడు. (చూడండి, తబ్లీగ్ రిసాలత్ మొదటి భాగం-పే. 58, మీర్ ఖాసిం అలి ఖాదియాని)



ఆ తరువాత 1886, మార్చి 22వ తేదీన మిర్జా గులాం అహ్మద్ ఈ విషయాన్ని గురించే మరోసారి భవిష్యత్ ప్రకటన చేస్తూ, "దేవుని వాగ్దానం ప్రకారం తొమ్మిది సంవత్సరాలలోగా ఈ పిల్లవాడు నాకు తప్పకుండా పుడతాడ"ని అన్నాడు. తిరిగి 1886, ఏప్రిల్ 8వ తేదీన వేరొక ప్రకటన చేస్తూ, అతి త్వరలోనే, అంటే ఒక గర్భధారణ కాలానికి మించకుండా తనకు తప్పకుండా కొడుకు పుడ్తాడని అన్నాడు. (తబ్లీగ్ రిసాలత్, మొదటి భాగం- పేజి 72, 75).

అప్పుడు అతని భార్య గర్భవతిగా ఉంది. అయితే కొన్నాళ్ళకు ఆమె కొడుకుకు బదులు కూతుర్ని కన్నది. అప్పుడు మిర్జా తన భవిష్యత్ ప్రకటన అసత్యమయినందుకు సిగ్గుపడకుండా, నా భవిష్యత్ ప్రకటన ఈ గర్భధారణకు సంబంధించినది కాదని, ఆ తరువాత గర్భధారణకు వర్తిస్తుందని అన్నాడు.

చివరికి 1887, ఆగస్టు 7వ తేదీన మిర్జా భార్య ఒక పిల్లవాడ్ని కన్నది. అప్పుడు మిర్జా గులాం అహ్మద్ సంతోషంతో భుజాలెగరేస్తూ, "దేవుడు నాకు వాగ్దానం చేసిన పిల్లవాడు ఇతనే" అని ప్రకటించాడు. (తబ్లీగ్ రిసాలత్, మొదటి భాగం పేజి-99)

మిర్జా గులాం అహ్మద్ తనపై అవతరించిన దివ్యావిష్కృతి (వహీ) ప్రకారం ఆ పిల్లవాడికి బషీర్ అహ్మద్ అని పేరు పెట్టాడు. (సీరతుల్ మెహ్ది, మొదటి భాగం-పే.80) కాని ఒక సంవత్సరం గడచిందో లేదో ఆ పిల్లవాడు చనిపోయాడు. ఇలా మిర్జా గారి ఈ భవిష్యత్ ప్రకటన కూడా గురి తప్పిపోయింది.

ఇంకా ఈ మహానుభావుడు తన బంధువు అహ్మద్ బేగ్ కూతురు ముహమ్మదీ బేగం అనే అమ్మాయి తన వివాహబంధం (నికాహ్)లోకి వస్తుందని, దీనికి ఆమె తరపువాళ్ళు ఎన్ని ఆటంకాలు సృష్టించినా ఈ

పెళ్ళి జరిగి తీరుతుందని స్వయంగా దేవుడే తనకు చెప్పాడని అన్నాడు. (ఇజాలె ఔహామ్‌లో 198వ పేజీ చూడండి)

మిర్జా గులాం అహ్మద్ ఆ అమ్మాయి తండ్రి మిర్జా అహ్మద్ బేగ్‌కు రాసిన ఈ రెండు ఉత్తరాలు చూడండి:

(1) "మీరు గనక నా మాట ఒప్పుకుంటే, నా మీద దయజూపి నాకు మేలు చేసిన వారవుతారు. నా పట్ల ఒక పుణ్యకార్యమవుతుంది. నేను మీకు సదా కృతజ్ఞుడయి ఉంటాను. మీ దీర్ఘాయుష్షుకోసం కరుణామయుడయిన దైవాన్ని ప్రార్థిస్తాను. నా స్థిర చరాస్తులలో మూడో భాగం మీ అమ్మాయికి ఇస్తానని వాగ్దానం చేస్తున్నాను. అంతేకాదు, నేను నిజం చెబుతున్నాను- నా ఆస్తిలో మీరు కోరిన వస్తువల్లా నేను మీకు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాను."

(2) "నేను ఇప్పటికీ ఎంతో వినమ్రతతో బ్రతిమాలుతున్నాను; ఈ సంబంధాన్ని కాదనకండి. ఈ సంబంధం మీ అమ్మాయి హోదా అంతస్తుల్ని పెంచుతుంది; శుభదాయకమవుతుంది. మీ ఊహకు కూడా తట్టని విధంగా దేవుడు మీ అమ్మాయి కోసం అపార శుభాల ద్వారాన్ని తెరుస్తాడు." (కలిమా ఫజల్ రహ్మాని-కూర్పు: ఖాజీ ఫజల్ అహ్మద్)

కాని ఈ పెళ్ళికి ఆ అమ్మాయి తల్లిదండ్రులు, బంధువులు నిరాకరించిన తరువాత వారిని నయాన, భయాన ఒప్పించడానికి ఆయన ఎలా ప్రయత్నించారో చూడండి:

"మహోన్నతుడైన దేవుడు నన్నిలా ఆదేశించాడు- అతని పెద్దకూతురి నికాహ్ కోసం బంధుత్వాన్ని ప్రారంభించు, వారితో చెప్పెయ్యి... ఈ నికాహ్ మీకు శుభదాయక మవుతుంది, ఓ కారుణ్య సూచనవుతుంది. ఒకవేళ (ఈ) నికాహ్ చేయడానికి నిరాకరిస్తే ఆ అమ్మాయి తీవ్రమైన దుష్పరిణా



మాలను ఎదుర్కుంటుంది. మరెవరితోనన్న వివాహయితే అతను నికాహ్ రోజునుంచి రెండున్నర సంవత్సరాల్లోగా, ఆ అమ్మాయి తండ్రి మూడేళ్ళలోగా మృత్యువాత పడతారు. వారి ఇండ్లలో కలతలు, దారిద్ర్యం, ఆపదలు విరుచుకుపడతాయి....." (అయినా కమాలాతే ఇస్లాం - పే. 286)

"... భవిష్యత్ ప్రకటన ప్రకారం అహ్మద్ బేగ్ అల్లుడి విధి (తఖ్దీర్) తిరుగులేనిది. దానికోసం నిరీక్షించండి. ఒకవేళ నేను అసత్యవాదినయితే ఈ భవిష్యత్ ప్రకటన నిజం కాదు. నాకు మరణం ప్రాప్తిస్తుంది" అని కూడా ఈ పెద్దమనిషి అల్టిమేటమ్ ఇచ్చాడు. (అంజామె ఆథమ్-పే.31)

పాపం, మిర్జాగారు ఎంత ప్రలోభపెట్టినా మరెంత బెదిరించినా ఆ అమ్మాయిని చేసుకోలేకపోయారు. చివరకు ముహమ్మదీ బేగం పెళ్ళి సుల్తాన్ ముహమ్మద్ అనే వేరొక వ్యక్తితో 17-4-1882న జరగనే జరిగింది. మిర్జా గులాం అహ్మద్ తన వార్నింగ్‌లో ఇచ్చిన రెండున్న ఏండ్ల గడువు కూడా గడిచిపోయింది. కాని ఆ అమ్మాయి భర్త నిక్షేపంగానే ఉన్నాడు. పైగా వారి దాంపత్య జీవితం ఎలాంటి వడిదుడుకులు లేకుండా సాగిపోయింది. మిర్జా చనిపోయిన అనేక ఏళ్ళదాకా అతను జీవించి ఉన్నాడు. అలాగే ఆ అమ్మాయి తండ్రి అహ్మద్ బేగ్ కూడా మూడేళ్ళ గడువుదాటిపోయిన తరువాత అనేక సంవత్సరాల దాకా జీవించి ఉన్నారు.

ఈ విధంగా మిర్జా గులాం అహ్మద్ దైవికమైనదని చేసిన భవిష్యత్ ప్రకటన పూర్తిగా అసత్యమని, అతను పచ్చి అబద్ధాలరాయుడని తేలిపోయింది.

మిర్జా శిష్యగణంలో డాక్టర్ అబ్దుల్ హకీం ఇరవై యేళ్ళపాటు ఖాదియానీ మతాన్ని అంటిపెట్టుకుని ఉండిన వ్యక్తి. ఆ తరువాత అతను దైవం ప్రసాదించిన సద్బుద్ధితో ఖాదియానీ మతం నుండి బయటపడ్డాడు. అతను మిర్జా గులాం అహ్మద్ వ్యక్తిత్వాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి

ఉన్నందున ఖాదియానీ మతం నుండి బయటికి రాగానే 1906, జులై 12వ తేదీన ఒక ప్రకటన విడుదల చేస్తూ "మిర్జా గులాం అహ్మద్ పచ్చి అబద్ధాలరాయుడు, దూబరదిండి, జిత్తులమారి. సత్యవాది ముందు(ఈ) దుష్టుడు నాశనమయిపోతాడు" అని అన్నాడు. మిర్జా వినాశం కోసం అతను మూడేళ్ళ గడువు సూచించాడు.

మిర్జా గులాం అహ్మద్ దానికి సమాధానంగా తనపై ఇలా దైవ సందేశం అవతరించిందని చెప్పుకున్నాడు: "నేను (అంటే దేవుడు) నీ ఆయుష్షును పెంచుతున్నాను. నీ జీవితకాలం 1907, జులై మాసం నుండి ఇంకా పధ్నాలుగు నెలలు మాత్రమే ఉందని శత్రువు (అంటే డాక్టర్ అబ్దుల్ హకీం) చెబుతున్నాడు. ఇతర శత్రువులు కూడా ఇలాంటి భవిష్యత్ ప్రకటనలే చేస్తున్నారు. వారందరినీ నేను అబద్ధీకులుగా చేస్తాను. నేను దేవుణ్ణని, ప్రతి పనీ నా అధీనంలో ఉందని వారందరికీ తెలిసివచ్చేలా నేను నీ ఆయుష్షును పెంచుతున్నాను." (తబ్లీగ్ రిసాలత్, పదోభాగం-పే.131)

కాని మిర్జా గులాం అహ్మద్ బూటకపు దైవప్రవక్త అని ఈ వ్యవహారం లోనూ దేవుడు నిరూపించాడు. డాక్టర్ అబ్దుల్ హకీం నిర్ణయించిన గడువు లోపలే మిర్జా గులాం అహ్మద్ 1908, మే 26వ తేదీన హఠాత్తుగా కలరా వ్యాధి సోకి చనిపోయాడు. డాక్టర్ అబ్దుల్ హకీం మటుకు ఆ తరువాత అనేక సంవత్సరాల దాకా నిక్షేపంగా జీవించి ఉన్నాడు.

మిర్జా గులాం అహ్మద్ 1891లో మసీహ్ మౌవూద్‌నని, 1901లో దైవప్రవక్తనని ప్రకటించుకోగానే అనేక మంది ధర్మవేత్తలు అతణ్ని తీవ్రంగా ఖండించనారంభించారు. వారిలో "అహ్లె హదీస్" పత్రిక సంపాదకులు మౌలానా సనావుల్లా ప్రముఖులు. మిర్జా గులాం అహ్మద్ ఆయనకు 5-4-1907లో ఇలా ఉత్తరం వ్రాశాడు:



"మీరు తరుచుగా మీ పత్రిక ప్రతి సంచికలో వర్ణిస్తున్నట్లు నేను అబద్ధాలకోరునయితే మీ జీవిత కాలంలోనే నేను అంతమయిపోతాను... ఒకవేళ నేను అసత్యవాదిని కాకపోతే దైవ నియుక్తుణ్ని, మసీహ్ మౌవూద్‌ని అయితే మాత్రం, దేవుని సంప్రదాయం ప్రకారం అసత్యవాదులకు లభించే శిక్ష నుండి మీరు తప్పించుకోలేరని ఆశిస్తున్నాను. ఆ శిక్ష మానవుని చేత్తోకాదు, దేవుడు చేత్తో పడే శిక్ష! అంటే ప్లేగు, కలరాలాంటి భయంకర శిక్షలు నా జీవితకాలంలోనే మీపై విరుచుకుపడకపోతే నేను దైవం తరపువాడ్నే (దైవప్రవక్తనే) కాదు." (తబ్లీగ్ రిసాలత్ పదో భాగం-పే.120)

ఈ లేఖ వెలువడిన ఒక సంవత్సరం దాకా మిర్జా గులాం అహ్మద్ బాగానే ఉన్నాడు. 1908 మే నెల 25వ తేదీ రాత్రి పది గంటల వరకూడా నిక్షేపంగానే ఉన్నాడు. ఆ రాత్రి భోజనం కూడా సుష్టుగా తిన్నాడు. కాని ఆ తరువాత కొన్ని క్షణాలకే హఠాత్తుగా భయంకరమైన 'కలరా' ఎటాక్ అయింది. పైనుంచి, క్రింది నుంచి ఏక ధాటిగా అశుద్ధ పదార్థం వెలువడ నారంభించింది. ఆ తరువాత కాస్సేపటికి నోరు పడిపోయింది. ఇలా పన్నెండు గంటలలోపే 26-5-1908న మిర్జా ప్రాణాలు అనంతవాయుల్లో కలిసిపోయాయి. దీన్నిబట్టి పై ఇద్దరిలో అసత్యవాదులెవరో ఎవరైనా ఇట్టే చెప్పగలరు.

## ఇంగ్లీషు ప్రవక్త బోధనలు-7

మిర్జా గులాం అహ్మద్‌ని దైవప్రవక్తగా విశ్వసించిన ఖాదియానీలు (అహ్మదీయులు) ముస్లింలను కాఫిర్లుగా పరిగణించి తమ మతాన్ని, విశ్వాసాల్ని, ఆచార వ్యవహారాల్ని పూర్తిగా వేరు చేసుకున్నారు. వారు ముస్లింల (ఇమామ్) వెనుక నమాజ్ చేయరు. ముస్లింల జనాజా నమాజ్‌లో పాల్గొనరు. తమ ఆడపిల్లల్ని ముస్లింలకిచ్చి పెళ్ళిచెయ్యరు. కనుక అలాంటి వాళ్ళతో ముస్లింలు కూడా ఏ పనిలోనూ సంబంధం పెట్టుకోకూడదు.

మిర్జా గులాం అహ్మద్ వారసునిగా వచ్చిన రెండవ ఖలీఫా మిర్జా మహ్మూద్ ఖాదియాని 21-8-1917న ఒక సమావేశంలో అహ్మదీయులకు అహ్మదీయేతరులకు ఉన్న వ్యత్యాసం గురించి ఇలా వివరించాడు:

"వారి (ముస్లిముల) ఇస్లాం వేరు. మన ఇస్లాం వేరు. వారి దేవుడు వేరు, మన దేవుడు వేరు, వారి హజ్ వేరు, మన హజ్ వేరు. అదే విధంగా ప్రతి విషయంలోనూ వారితో మనకు విభేదముంది అని హజ్రత్ మసీహ్ మౌవూద్ అన్నారు."

స్వయంగా మిర్జా గులాం అహ్మద్ తన మతాన్ని గురించి సంక్షిప్తంగా ఇలా నిర్వచించాడు:

"ఇస్లాంలో రెండు భాగాలు ఉన్నాయి: ఒకటి, దేవుని పట్ల విధేయత కలిగి ఉండటం, రెండు దుర్మార్గుల బారినుండి కాపాడి తన నీడలో ఆశ్రయం కల్పించి శాంతి నెలకొల్పిన రాజ్యం పట్ల విధేయత కలిగి ఉండడం. ఆ రాజ్యం బ్రిటీష్ ప్రభుత్వం, నేను మాటిమాటికి బహిర్గతం చేస్తున్న నా మతం ఇదే." (షహాదతుల్ ఖుర్‌ఆన్-అనుబంధం)

యావత్తు భారతప్రజలు బ్రిటిష్ సామ్రాజ్యానికి వ్యతిరేకంగా పోరాడు తున్న రోజుల్లో, ప్రత్యేకంగా ముస్లింనాయకులు, ముస్లింధర్మవేత్తలు, బ్రిటీష్ ప్రభుత్వాన్ని ఎదిరించడం గొప్పదైవకార్యమని భావించి దానిపై తిరుగుబాటు బావుటా లేవనెత్తిన ఆ కాలంలో మిర్జా గులాం అహ్మద్ తెల్లవాళ్ళ ప్రభుత్వా నికి విధేయులయిపోయి దాన్ని గట్టిగా సమర్థించేవాడు. అతను తన పుస్తకం అల్ బరియాలో "నేనీ గవర్నమెంటుకు పక్కా శ్రేయోభిలాషి అయిన కుటుంబానికి చెందినవాణ్ణి" అని స్పష్టంగా చెప్పుకున్నాడు.

"భారత మహారాణి (విక్టోరియా)! ఎంతో ఔన్నత్యం, ప్రాభవాలు కలిగిన నీకు శుభం కలుగుగాక. దేవుడు తన దృష్టిని ఈ దేశంపై ప్రసరింప జేశాడు. నీ (ఆశీర్వాద) హస్తమున్న ఈ దేశ ప్రజలపై దేవుని కారుణ్యహస్తం



ఉంది. నీ పవిత్ర సంకల్పాల ఫలితంగానే దేవుడు నన్ను సయోధ్య, సద్గుణ, సంపత్తి, భక్తి ప్రపత్తుల మార్గాలను ప్రపంచంలో పునర్నిర్మించడానికి పంపించాడు." (సితారా ఖైసరా-పే.15)

"(విక్టోరియా) మహారాణీ! నీ చిత్తశుద్ధి, పవిత్ర సంకల్పాలే ఆకాశ సహాయాన్ని నీ వైపునకు లాగుతోంది. నీ చిత్తశుద్ధిలోని ఆకర్షణ శక్తి వలనే ఆకాశం (దైవ)కారుణ్యంతో పాటు భూమి వైపునకు వంగిపోతోంది. అందువల్ల మసీహ్ మౌవూద్ ఆవిర్భావానికి నీ పరిపాలనా కాలం తప్ప మరెవరి పాలనాకాలం యోగ్యమయినది కాజాలదు. జ్యోతి జ్యోతినే తన వైపునకు ఆకర్షిస్తుంది. కనుక నీ జ్యోతిర్మయ పాలనా కాలంలో దేవుడు ఆకాశం నుండి ఒక జ్యోతి (మిర్జా గులాం అహ్మద్)ని అవతరింపజేశాడు." (సితారా ఖైసరా-పే.11)

"1857లో విచక్షణా జ్ఞానంలేని ప్రజలు తమకు మేలు చేస్తున్న (బ్రిటీష్) ప్రభుత్వంపై తిరుగుబాటు చేసి దేశాన్ని అలజడి, అల్లకల్లోలాల్లోకి నెట్టివేశారు. అలాంటి సంక్షోభ స్థితిలో మా తండ్రిగారు తమ కష్టార్జితంతో యాభై గుర్రాలు కొని, యాభై రౌతులను సమకూర్చి (ఆంగ్లేయ) ప్రభుత్వానికి సమర్పించారు. అందువల్లనే ఆయనకు గవర్నర్ జనరల్ ఆస్థానంలో ఎంతో గౌరవప్రదంతో కుర్చీ లభిస్తుండేది. ప్రతి ఆంగ్లేయ అధికారి ఆయన్ని ఎంతో గౌరవించేవాడు, సంతోషపెట్టేవాడు." (షహాదతుల్ ఖుర్‌ఆన్-పే.84)

"నేను ఆంగ్లేయ ప్రభుత్వాన్ని సమర్థించే పనిలో నా జీవితపు అత్యధిక భాగాన్ని గడిపాను. జిహాద్ (ధర్మపోరాటం)ను వ్యతిరేకిస్తూ, ఆంగ్లేయుల పట్ల విధేయత చూపాలన్న విషయంలో అసంఖ్యాకమైన పుస్తకాలు వ్రాశాను; వాటన్నిటిని ఒకచోట చేర్చి ఏభై బీరువాలను నింపవచ్చు.... ముస్లిములు ఈ ప్రభుత్వానికి నిజమయిన శ్రేయోభిలాషులై మెలిగేలా చేయడానికి నేను ఎల్లప్పుడూ పాటుపడుతున్నాను." (తర్యాఖుల్ ఖులూబ్-పే.15)

“నేను ఇరవై ఏండ్ల దాకా ఆంగ్లేయ ప్రభుత్వం పట్ల వినయవిధేయతలు కలిగివుండాలని ప్రజలను బోధిస్తున్నాను. నా శిష్యులకు కూడా ఈ విషయాన్నే ఉపదేశిస్తున్నాను.” (తర్యాఖుర్ ఖులూబ్-పే.26)

“దాదాపు అరవై యేళ్ళ ప్రాయానికి చేరుకున్న నేను నా ప్రారంభ వయస్సు నుంచి ఇంగ్లీషు గవర్నమెంటు (బ్రిటిష్ ప్రభుత్వం) పట్ల నిజమైన ప్రేమ, సానుభూతి, శ్రేయోభిలాష జనించేలా ముస్లింల హృదయాలను మార్చేపనిలో..... కొందరు అవగాహనా మాంద్యులైనవారి హృదయాల్లో నుంచి చిత్తశుద్ధి, సత్సంబంధాలను నిరోధించేటటువంటి జిహాద్ వగైరా తప్పుడు భావాలను దూరం చేసే పనిలో నిమగ్నుణ్ణయ్యాను.” (తబ్లీగ్ రిసాలత్, 7వ భాగం-పే.10)

“బ్రిటిష్ రాజ్యం ప్రసాదించిన శాంతినీడలోనే ఇస్లాం పునరుజ్జీవనం నొందిందని మేము సాక్ష్యమిస్తున్నాము. మీరు నన్ను ఎంత దూషించినా, మనస్సులో మరేమనుకున్నా లేదా మునుపటిలా నన్ను కాఫిర్ (అవిశ్వాసి) అని తీర్మానించినా సరే, నా సిద్ధాంతం మాత్రం ఇదే.” (తర్యఖుల్ ఖులూబ్-పే.26)

“ఈ (బ్రిటిష్) ప్రభుత్వం పట్ల మనసులో అసూయాద్వేషాలు పెట్టుకునే ముస్లిం పరమమూర్ఖుడు, అజ్ఞాని, అమాయకుడు, అసమర్థుడు.” (ఇజాల ఔహాం-పే. 211)

“ఈ బ్రిటిష్ గవర్నమెంటు పట్ల ఎల్లప్పుడు కృతజ్ఞులయి ఉండటం మాకు, మా సంతానానికి ఫర్జ్ (విధి) అయిపోయింది.” (ఇజాలా ఔహాం-పే.58)

“ఒకసారి జరిగిన సంఘటన గుర్తుకొచ్చింది. ఇంగ్లీషులో నాకు I love you అని దివ్యసందేశం వచ్చింది. అంటే, ‘నేను (దేవుడు) నిన్ను ప్రేమిస్తున్నాన’ని అర్థం. తరువాత I am with you అని దివ్యసందేశం



వచ్చింది. అంటే, ‘నేను నీకు తోడుగా ఉన్నాను’ అని అర్థం. ఆ తరువాత I shall help you అని దైవసందేశం వచ్చింది. అంటే, ‘నేను నీకు సహాయం చేస్తాను’ అని అర్థం. ఆ తరువాత I can what i will do అని వచ్చింది. అంటే, ‘నేను తలచుకున్నది చేయగలను’ అని అర్థం. ఆ తరువాత నా శరీరం కంపించే అంత తీవ్రంగా We can what we will do అని దైవసందేశం వచ్చింది. అంటే, ‘మేము, ఏది తలచుకుంటే అది చేయగలము’ అని అర్థం. అప్పుడు నేను ఆ కంఠస్వరం, ఉచ్ఛారణలను గమనిస్తే, ఒక ఆంగ్లేయుడు నా చెవి దగ్గర నిల్చొని మాట్లాడుతున్నట్లు అన్పించింది నాకు.” (బరాహీన్ అహ్మదియా-పే.480)

మిర్జా గులాం అహ్మద్‌కు దివ్యావిష్కృతి (వహీ) ద్వారా అందిన ఈ దైవ సందేశాలను కూడా చూడండి:

(1) Yes, I am happy ( ఔను, నేను సంతోషంగా ఉన్నాను)

(2) Life is pain (జీవితం దుఃఖమయం)

(3) God is coming by His army (దేవుడు తన సైన్యంతో (నీ దగ్గరికి) వస్తున్నాడు)

(4) He is with you to kill enemy (ఆయన శత్రుసంహారం కొరకు నీతో ఉన్నాడు)

(5) The days shall come when God shall help you (దేవుడు నీకు సహాయం చేసే రోజులు (త్వరలోనే) వస్తాయి) (హఖైఖతుల్ వహీ-పే.303)

1907లో పంజాబ్ రాష్ట్రంలో ఆంగ్లేయులకు వ్యతిరేకంగా జాతీయ ఉద్యమం ప్రారంభమయినప్పుడు, మిర్జా గులాం అహ్మద్, బ్రిటీష్ పాలకులకు తన పూర్తి మద్దతు ప్రకటించాడు. అంతేకాదు తనను

విశ్వసించేవారంతా బ్రిటిష్ ప్రభుత్వానికి విధేయులయి ఉంటూ జాతీయ ఉద్యమాన్ని అణచివేయడంలో ఆంగ్లేయులకు సర్వ విధాలా సహక రించాలని కూడా అతను ఒక ఫర్మానా జారీ చేశాడు.

## ఖలీఫా రాసలీలలు-8

మిర్జా గులాం అహ్మద్ మరణానంతరం హకీం నూరుద్దీన్ అతనికి వారసునిగా ఖలీఫా అయ్యాడు. హకీం ఆరేళ్ళపాటు ఈ పదవిలో ఉన్నాడు. తరువాత గుర్రం మీద నుండి పడిపోయి కొన్నాళ్ళపాటు మంచాన పడి, 13-3-1914న చనిపోయాడు. చనిపోయే ముందు కొన్ని రోజులపాటు అతని నోరు పడిపోయింది. (అల్ ఫజల్: 23-2-1932). అతని తరువాత ఖాదియానీ మతం రెండు వర్గాలుగా చీలిపోయింది. ఒక వర్గానికి మిర్జా గులాం అహ్మద్ పెద్ద కొడుకు మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ ఖలీఫాగా ఎంపికయ్యాడు.

రెండో వర్గానికి ముహమ్మద్ అలి నాయకుడయ్యాడు. ఈ వర్గం లాహోర్‌ని కేంద్రంగా చేసుకొని పనిచేస్తోంది. మిర్జా గులాం అహ్మద్‌ని మొదటివర్గం మసీహ్ మౌవూద్ అని, దైవప్రవక్త అని విశ్వసిస్తుంటే, ఈ రెండో వర్గం మాత్రం అతడ్ని ఒక మత సంస్కర్తగా మాత్రమే నమ్ముతోంది. ఈ వర్గం ప్రభావం క్రమంగా క్షీణించి ప్రస్తుతం లాహోర్‌కు మాత్రమే పరిమితమయిపోయింది.

మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ దాదాపు 52 సంవత్సరాల పాటు ఖాదియానీ మతాన్ని ఏకఛత్రాధిపతిగా ఏలాడు. అడ్డుచెప్పిన ప్రతి అనుచరుడ్నీ మౌనంగా మట్టుపెడ్తూ ఇతను ఖాదియానీ మతాన్ని బాగా ముందుకు తీసికెళ్ళాడు. మిర్జా మహ్మూద్ మతం, పవిత్రతల చాటున పచ్చి వ్యభిచారానికి పాల్పడుతుండేవాడని, అతని రెండవ కొడుకు మిర్జా తాహెర్‌కు మౌలానా ముహమ్మద్ యూసుఫ్ లూథియాన్వి ఛాలెంజ్ చేస్తూ



రాసిన ఒక సుదీర్ఘ లేఖలో ఆరోపించాడు. ఈ ఆరోపణకు మిర్జా తాహెర్ ఎలాంటి సమాధానం ఇవ్వలేకపోయాడు (నిజాన్ని నిరాకరించలేక). ఆ లేఖలోని కొన్నివిషయాలు చూడండి:

అర్ధ శతాబ్దం (1950) వరకు ముస్లిం ధర్మవేత్తలు ప్రమాణం చేయ వలసిందిగా మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్‌ని ఛాలెంజ్ చేస్తూ ఉండేవారు. కాని మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ ఏ ఒక్క ధర్మవేత్తను కూడా ఎదుర్కోవ డానికి సాహసించలేకపోయాడు. మౌలానా అబ్దుల్‌కరీం ప్రమాణం చేయడానికి రావలసిందిగా చాలెంజ్ చేస్తూ రాసిన లేఖలో మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్‌పై వ్యభిచార ఆరోపణను మోపారు. మిర్జా మహ్మూద్ ఆ ఛాలెంజ్‌ని స్వీకరించడానికి బదులు మౌలానా అబ్దుల్ కరీంని రకరకాలుగా వేధించడానికి పూనుకున్నాడు. ఆయన ఇంటిని తగలబెట్టించాడు. ఆయనపై హత్యా ప్రయత్నం చేయించాడు. ఈవిధంగా అతను మౌలానా అబ్దుల్ కరీం చెల్లెలు సకీనా సయితం మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్‌వడిగట్టిన ఘోరపాపానికి బలయిపోయింది.

మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ అనుచరుల్లో అబ్దుర్రహ్మాన్ మిస్రి ఎంతో ముఖ్యుడు. మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ పర్యటనలో ఉన్నప్పుడు అతను ఖాదియాన్‌లో తాత్కాలిక ఖలీఫాగా కూడా పనిచేసి ఉన్నాడు. అయితే బహుశా 1936లో అతని కుమారుడ్ని మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ తన పాశవిక కోరికకు దారుణంగా బలి చేశాడు. ఈ వ్యవహారం గురించి ఒక విచారణ సంఘాన్ని నియమించాలని డిమాండు చేసినందుకు అబ్దుర్రహ్మాన్‌పై, అతని స్నేహితుడు ఫఖ్రుద్దీన్ ముల్తానీపై మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ దౌర్జన్యకాండ సాగించాడు. ముల్తానీని హత్య చేయించాడు. అబ్దుర్రహ్మాన్ శాంతి భద్రతలకు విఘాతం కలిగించాడన్న ఆరోపణతో అతని మీద బూటకపు కేసులు బనాయించాడు.

అబ్దుర్రహ్మాన్ మిస్రీ ఈ కేసు గురించి లాహోర్ హైకోర్టు ముందు సాక్ష్యమిస్తూ ఇలా అన్నాడు: "ప్రస్తు ఖలీఫా పచ్చి తిరుగుబోతు, ఇతను మతం అడ్డం పెట్టుకొని స్త్రీలను వేటాడుతుంటాడు. ఈ పనికోసం అతను కొందరు స్త్రీ పురుషుల్ని ఏజెంట్లుగా నియమించాడు. ఈ ఏజెంట్ల ద్వారా అతను అభం శుభం ఎరగని బాలబాలికలను తన అదుపులోకి తెచ్చు కుంటాడు. అతను కొందరు స్త్రీలు, పురుషులతో కూడిన ఒక సొసైటీని కూడా ఏర్పరచాడు. ఆ సొసైటీలో వ్యభిచారం జరుగుతుంది."

అబ్దుర్రహ్మాన్ మిస్రి ఓ సారి మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్‌కు రాసిన ఒక లేఖలో ఇలా పేర్కొన్నాడు: "నేను మీ వెనుక (మీ నేతృత్వంలో) నమాజు చేయను. మీరు ఒక్కోసారి అశుద్ధావస్థ (జున్బీ)లోనే నమాజు చేయిస్తారని నాకు అనేకమంది ద్వారా తెలిసింది."

మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ నేతృత్వంలోని ఖాదియానీ మత సంస్థలో "హఖైఖత్ పసంద్ పార్టీ" పేరుతో ఒక తిరుగుబాటు వర్గం లేచింది. ఈ వర్గం మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ దుర్గుణాలు, దుర్మార్గాలను తీవ్రంగా ఎండగట్టింది. దీన్ని గురించి "తారిఖె మహ్మూద్" పేరుతో ఏకంగా ఒక పుస్తకాన్నే ప్రచురించింది. అందులో మిర్జా బషీరుద్దీద్ మహ్మూద్ "జారత్వం"పై 28 మంది ఖాదియానీ స్త్రీ పురుషుల సాక్ష్యాలు సేకరించ బడ్డాయి. ఈసాక్ష్యాల ప్రకారం మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ తన కుమార్తెల ద్వారా కూడా తన లైంగికపిపాసను తీర్చుకునేవాడని, చివరికి తన కళ్ళ ముందే తన భార్యచేత వ్యభిచారం చేయించేవాడని తెలుస్తోంది.

## ఆంగ్లేయుల ప్రతినిధి-9

మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ నేతృత్వంలోని ఖాదియానీ మత వర్గం ఖాదియాన్ గ్రామాన్ని కేంద్రంగా చేసుకొని తన పంజాను మొదట పంజాబ్ రాష్ట్రం మీద విసరడానికి పథకం వేసుకుంది. బ్రిటిష్ ప్రభుత్వం దానికి



అన్ని విధాలా తన సహాయ సహకారాలు అందజేయసాగింది. అందువల్ల ఈ వర్గం తన ప్రచార కార్యకలాపాలను రోజురోజుకు విస్తృతపరచుకుంటూ ఇస్లాంకు, ముస్లిం సమాజానికి పెద్ద ముప్పుగా పరిణమిస్తూ పోయింది. మొదటి ప్రపంచ యుద్ధంలో బగ్దాద్, బైతిల్ మఖ్దిస్ (జెరూసలేం), కాన్స్టాంటి నోపిల్ నగరాలు ఆంగ్లేయుల కైవశమయినప్పుడు వారి విజయం పట్ల ఖాదియానీలు ఆనందోత్సవాలు జరుపుకున్నారు. వారి ఖలీఫా తన స్వామి భక్తిని చాటుకుంటూ, ఆంగ్లేయ ప్రభుత్వ అభివృద్ధితో మా అభివృద్ధి ముడిపడి ఉందని, వారి పాలన ఎక్కడెక్కడ విస్తరిస్తుందో అక్కడ మాకు మత ప్రచారావకాశాలు లభిస్తాయని బహిరంగంగా ప్రకటించాడు.

కాని విచారకరమైన విషయం ఏమిటంటే, ఖాదియానీలు బ్రిటిష్ ప్రభుత్వానికి పూర్తిగా విధేయులయి, భారత స్వాతంత్ర్య సమరంలో దానికి తమ పూర్తి మద్దతు నిచ్చి జాతి విద్రోహులుగా తయారయినప్పటికీ, కాంగ్రెస్‌లోని మన నేషనలిస్ట్ లీడర్లకు ఖాదియానీలే ఆప్తమిత్రులుగా, దేశ శ్రేయోభిలాషులుగా కన్పించారు. ఒక నాయకుడు ఖాదియానీల పట్ల తన ప్రేమాభిమానాలను బహిరంగంగా వ్యక్తపరచుకుంటూ "మా దృష్టిలో ముస్లిం లందరికంటే ఖాదియానీలే మాకు అత్యంత ప్రియమైన వాళ్ళు. కారణం, వారి ప్రవక్త ఈ దేశానికి చెందినవారు, వారి పుణ్యస్థలాలు కూడా ఈ దేశంలోనే ఉన్నాయి" అని అన్నాడు. ఖాదియానీ మతం గనక బాగా వ్యాపిస్తే భారత దేశ పవిత్రత ఇనుమడిస్తుందని, భారత ముస్లింలు తమ దృష్టిని అరేబియా నుండి మరలించుకొని భారత దేశాన్నే తమ 'ఖిబ్లా'గా, ఆధ్యాత్మిక కేంద్రంగా చేసుకుంటారని, దాని వల్ల ముస్లింల హృదయాల్లో దేశభక్తి, జాతీయ భావాలు ఎంతో దృఢమవుతాయని ఈ నేషనలిస్టు నాయకులు భావించారు.

చివరికి అప్పటి భారత ప్రధాని పండిట్ జవహర్ లాల్ నెహ్రూ కూడా ఖాదియానీలను ముస్లిమేతరులుగా పరిగణించాలన్న ముస్లింల

డిమాండును విమర్శిస్తూ, "ముస్లింలలోని విభిన్న మతవర్గాలలో ఖాదియానీలు కూడా ఒక వర్గం అయినప్పుడు, వారిని ముస్లింలు ఇస్లాం నుండి వేరు చేయాలని ఎందుకు పట్టుబడుతున్నారు?" అని ప్రశ్నించారు. విశ్వవిఖ్యాత ఉర్దూకవి, ప్రముఖ ఇస్లాం తత్వవేత్త అయిన డాక్టర్ ఇఖ్బాల్ దీనికి సమాధానమిస్తూ పండిట్ నెహ్రూకు ఓ సుదీర్ఘ లేఖ రాశారు. ఖాదియానీ ఉద్యమం అరబ్బీ ప్రవక్త (సల్లం) అనుచర సమాజం నుండి హిందూ ప్రవక్త అనుచర సమాజాన్ని వేరుచేయడానికి జరుగుతున్న ప్రయత్నమని ఆయన తన లేఖలో అన్నారు.

1947లో దేశ విభజన తరువాత ఆంగ్లేయుల పుణ్యమా అంటూ ఖాదియానీలు మరింత బలపడసాగారు. ఆంగ్లేయులు తమ మూటా ముల్లె సర్దుకొని పోతూపోతూ ఖాదియానీ మతస్థుడయిన సర్ జఫ్రుల్లా ఖాన్‌ని పాకిస్తాన్‌లో ప్రతిష్ఠించి మరీపోయారు. జఫ్రుల్లాఖాన్ మాత్రమే ఇటు పాకిస్తాన్‌లో, అటు మధ్యప్రాచ్యంలో తమ ప్రయోజనాలను కాపాడగలిగే వ్యక్తి అని భావించారు. ఈ లక్ష్యం కోసం వారు జఫ్రుల్లా ఖాన్‌ని మంత్రి మండలిలోకి తీసుకునేలా పాకిస్తాన్ నిర్మాత ముహమ్మద్ అలి జిన్నాపై వత్తిడి తీసుకువచ్చారు. కొందరి అభిప్రాయం ప్రకారం వారు ముహమ్మద్ అలి జిన్నాను మోసగించి జఫ్రుల్లా ఖాన్‌కు మంత్రిమండలిలో అత్యంత కీలకపదవి అయిన విదేశాంగ మంత్రిత్వశాఖను కట్టబెట్టించారని తెలుస్తోంది.

జఫ్రుల్లా ఖాన్ దేశ విభజనకు ముందు నుంచే బ్రిటిష్ పాలకులకు నమ్మిన బంటుగా పనిచేస్తూ వచ్చాడు. పైగా అతను దేశంలోని అధిక సంఖ్యాకులయిన ముస్లింల విషయంలో పచ్చి మత దురభిమాని. అతని మతవిశ్వాసం ప్రకారం మిర్జా గులాం అహ్మద్‌ని దైవప్రవక్తగా నమ్మని ముస్లిం లంతా కాఫిర్‌ల క్రిందే లెక్క. అంతేకాదు, ఖాదియానీలు ముస్లింల వెనుక నమాజు చేయరు; ముస్లింలకు తమ స్త్రీలనిచ్చి పెళ్ళి చేయడం ధర్మ సమ్మతం కాదు; చివరికి ముస్లింల జనాజా నమాజులో కూడా వారు పాల్గొన



కూడదు. ఈ కారణంగానే ముహమ్మద్ అలి జిన్నా చనిపోయినప్పుడు జఫ్రుల్లా ఖాన్ ఆయన జనాజా నమాజులో పాల్గొన లేదు. అప్పుడే ముస్లింలు ఇలాంటి వ్యక్తి పాకిస్తాన్ అధిక సంఖ్యాకుల అభిప్రాయాన్ని గౌరవించడని భావించారు.

వారు భావించినట్లే జఫ్రుల్లా ఖాన్ విదేశాంగ మంత్రి పదవి చేపట్టగానే తన శాఖలోని కీలక స్థానాల్లోని ముస్లింలను తొలగించి తన మతస్థుల్ని చేర్చుకున్నాడు. దౌత్య కార్యాలయాల్లోనూ, ప్రభుత్వ యంత్రాంగంలోని ఇతర శాఖల్లోనూ తన మతస్థులకు ఉన్నత పదవులు ఇప్పించి, ముస్లిం ఉద్యోగులపై వారు తమ ఇష్టమొచ్చినట్లు పెత్తనం చెలాయించడానికి అనువయిన వాతావరణాన్ని సృష్టించాడు. ఈ ఖాదియానీ ఆఫీసర్లు అధికారాన్ని అడ్డం పెట్టుకొని ముస్లిం ఉద్యోగుల్ని రకరకాలుగా వేధించేవారు. పైగా వారు ముస్లింలను భయప్రలోభాలతో ఖాదియానీలుగా మార్చడానికి ప్రయత్నించేవారు.

జఫ్రుల్లా ఖాన్ కారణంగానే ఖాదియానీలు పెద్ద ఎత్తున సైన్యంలో, పోలీసు శాఖలో, ఎయిర్ సర్వీసులో, రైల్వే శాఖలో పెద్దపెద్ద పదవులు సంపాదించ గలిగారు. సైన్యంలో 'ఫుర్ఖాన్ బెటాలియన్' పేరుతో పూర్తిగా ఖాదియానీలతో కూడిన ఒక ప్రత్యేక సైనిక దళాన్ని ఏర్పరచుకున్నారు. ప్రభుత్వం నుండి సులభంగా లైసెన్సులు పొందడం ద్వారా వారు ఆయుధాలు ఉత్పత్తి చేసే ఫ్యాక్టరీలు కూడా అనేకం స్థాపించుకున్నారు. వారి ఖలీఫా మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ ప్రభుత్వ అండదండలు, ఆయుధ కర్మాగారాలు చూసుకొని విర్రవీగుతూ, "మేము విజయం సాధిస్తాము. అప్పుడు మీరు తప్పకుండా నేరస్థుల్లా మా ముందు తలలు వంచి నిలబడవలసి వస్తుంది. అప్పుడు మీకు మక్కా విజయం నాడు అబూజహల్‌కు, అతని పార్టీవారికి పట్టినటువంటి గతే పడుతుంది" అని ముస్లింలను బెదిరించాడు.

ఈవిధంగా మిర్జా బషీరుద్దీన్ మహ్మూద్ నాయకత్వంలోని ఖాదియానీలు వీలయినప్పుడు తిరుగుబాటు చేసి ప్రభుత్వాన్ని పూర్తిగా తమ హస్తగతం చేసుకోగలిగే విధంగా పరిస్థితుల్ని మార్చుకో నారంభించారు. అంతేకాదు, పంజాబ్‌లో రబ్వా పేరుతో వారు ఒక స్వతంత్ర రాష్ట్రాన్ని కూడా ఏర్పరచుకున్నారు. ఇక్కడ ప్రభుత్వ ఉద్యోగాలలో ఖాదియానీ మతస్థుల్ని మాత్రమే చేర్చుకున్నారు. చివరికి ఆ ప్రాంతం రైల్వేశాఖ సైతం ఖాదియానీలతో నిండిపోయింది. ఖాదియానీలుకాని వారికి అక్కడ ఏ మాత్రం స్థానం లేకుండా చేశారు.

ముస్లిం మేధావులు, ధర్మవేత్తలు ఈ పరిస్థితిని గమనించి తీవ్ర ఆందోళన చెందారు. తక్షణమే ప్రభుత్వం ఖాదియానీలను అవిశ్వాసులుగా పరిగణించి వారిని ముస్లిం సమాజం నుండి వేరుచేయడం ఒక్కటే ఈ సమస్యకు పరిష్కారమని వారు భావించారు.

మహాకవి డాక్టర్ ఇఖ్బాల్ (రహ్మాలై) కూడా తన ప్రసంగాల్లో ఈ విషయాన్నే ప్రతిపాదించారు. ప్రధానమంత్రి లియాఖత్ అలి ఖాన్ తన చివరి రోజుల్లో ఈ ప్రమాదాన్ని గుర్తించి పరిస్థితుల్ని ఓ కంట గమనించడం ప్రారంభించారు. కాని ఆ తరువాత కొన్నాళ్ళకే ఆయన్ని దుర్మార్గులు దారుణంగా హత్య చేశారు. ఆయన ఆలోచనా తీరులో వచ్చిన మార్పే ఈ హత్యకు కారణమని వేరే చెప్పనవసరం లేదు.

# దేశవ్యాప్త ఉద్యమం-10

ఈ సమస్య రోజురోజుకు జటిలమవుతూ 1953 జనవరిలో వివిధ ఇస్లామీయ సంస్థలు, సంఘాలు, వ్యక్తుల్ని ఒక వేదిక మీదికి చేర్చింది. ప్రముఖ నాయకులు, మేధావులు, ధర్మవేత్తలు సమావేశమయి ఖాదియానీలను ముస్లిమేతర మైనారిటీ వర్గంగా పరిగణించాలని, వారి జనాభా ప్రాతిపదికపై మాత్రమే పార్లమెంటులో, ప్రభుత్వ యంత్రాంగంలో వారికి



ప్రాతినిధ్యం ఇవ్వాలని (అంతకు మించి ఎలాంటి హోదా అంతస్థులు ఇవ్వరాదని) ప్రభుత్వం ముందు ఒక ప్రతిపాదన ప్రవేశపెట్టారు. కాని వారి ప్రతిపాదన చెవిటివాడి ముందు శంఖం ఊదినట్లయింది. అప్పుడు వారు దేశవ్యాప్తంగా బ్రహ్మాండమైన ఓ ప్రజాఉద్యమాన్ని లేవదీశారు. ప్రభుత్వ యంత్రాంగం, ట్రాన్స్‌పోర్ట్‌లు పూర్తిగా స్తంభించి పోయాయి. ఈ ఉద్యమాన్ని గురించి మౌలానా సయ్యిద్ అబుల్ హసన్ అలి నద్వి (రహ్మాలై) తమ అభిప్రాయాన్ని ఇలా రాస్తున్నారు:

"ఈ ఉద్యమాన్ని ప్రభుత్వం తిరుగుబాటు ఉద్యమంగా ప్రకటించి అణచి వేసేందుకు సర్వసాధనాలను ఉపయోగించింది. వాస్తవానికి ఇది తిరుగుబాటు ఎంతమాత్రం కాదు. ఇది ప్రశాంతమైన మనస్సుతో న్యాయ సమ్మతమైన డిమాండుతో, ప్రజలు లేవదీసిన ఉద్యమం. వారు తమ ప్రభుత్వానికి విధేయులయి ఉన్న ప్రజలు; ప్రభుత్వ రక్షణకు, దాని సేవకు కట్టుబడి ఉన్నవారు.

కాని ప్రభుత్వం సైన్యాన్ని దించి ఈ ఉద్యమాన్ని అణచి వేయడానికి ప్రజలపై విచక్షణా రహితంగా కాల్పులు జరిపించింది. వేలాది మంది ధర్మవేత్తల్ని, అమాయక ప్రజల్ని జైళ్ళలో వేయించింది. ఈ ఉద్యమానికి ఆలవాలమైన పంజాబ్ రాష్ట్రాన్ని సైనికుల దయాదాక్షిణ్యాలపై వదలి పెట్టింది. సైనికుల దౌర్జన్యకాండకు ముఖ్యంగా లాహోర్ తీవ్రంగా బలి అయింది. అక్కడ రెండు నెలలకు పైగా మార్షల్ లా పాలన విధించబడింది. సైనికులు పెద్ద ఎత్తున ప్రజలను పట్టుకెళ్ళి కాల్చిచంపేశారు. ప్రభుత్వం ఉద్యమనేతలను బూటకపు కేసులతో సైనిక న్యాయస్థానాలకు ఈడ్చింది. కొందరికి మరణ శిక్ష విధించింది.

మరణ శిక్ష విధించబడిన వారిలో పాకిస్తాన్ జమాఅతె ఇస్లామీ నాయకులు మౌలానా సయ్యిద్ అబుల్ ఆలా మౌదూది (రహ్మాలై) కూడా

ఉన్నారు. అయితే (యావత్తు ముస్లిం జగత్తులో తీవ్రమైన నిరసనలు, కోపోద్రేకాలు పెల్లుబకడంతో) మరుసటి రోజే మరణ శిక్షను 14 యేండ్ల కఠిన కారాగార శిక్షగా మార్చవలసి వచ్చింది. (రెండేళ్ళ తరువాత 1955 ఏప్రిల్‌లో ఆయన్ని విడుదల చేశారు). మౌలానా చేసిన నేరమల్లా ఒక్కటే- ఆయన "ఖాదియానీ మస్లా" అనే పేరుతో ఒక పుస్తకం రచించారు. అందులో ఆయన ఇస్లాం, ముస్లింలను గురించి ఖాదియానీ మత వైఖరి ఏమిటో తెలియజేస్తూ, పాకిస్తాన్‌లో ఖాదియానీ మతస్థుల్ని ముస్లిమేతర మైనారిటీలుగా పరిగణించాలని అన్నారు. దానికి కారణాలు ఆయన పేర్కొన్నారు. ఆ పుస్తకాన్ని ప్రచురించి పెద్ద ఎత్తున ప్రచారం చేయడం జరిగింది. జమాఅతె ఇస్లామీకి చెందిన ఇతర నాయకులక్కూడా అనేక ఏండ్ల కఠిన కారాగార శిక్షలు విధించబడ్డాయి." (ఖాదియానియత్", రచన: మౌలానా అబుల్ హసన్ అలి నద్వీ)

ఈ పుస్తకంలోనే పై పేరా రాసిన ఒక పాదసూచికలో మౌలానా అబుల్ హసన్ అలి నద్వీ (రహ్మలై) ఈ విధంగా తెలియజేస్తున్నారు:

"పాకిస్తాన్‌లో జనసామాన్యం అభిప్రాయం ప్రకారం, ప్రభుత్వం జమాఅతె ఇస్లామీని వదిలించుకోవడానికి ఇదే తగిన సందర్భమని భావించింది. కారణం జమాఅత్ ఒక వైపు దేశంలో ఇస్లామీయ రాజ్యాంగాన్ని అమలుపరచాలని ప్రభుత్వాన్ని మాటిమాటికి డిమాండ్ చేస్తుండేది. ఈ విషయాన్ని పాకిస్తాన్ వాగ్దానం చేసి ఉన్నది. ఆ ప్రాతిపదికపైన్నే పాకిస్తాన్ ఆవిర్భవించింది. మరోవైపు జమాఅత్ దేశంలోని దైనందిన జీవిత వ్యవహారాలను, ప్రభుత్వ పాలసీలను ఇస్లాంకు అనుగుణంగా తీర్చిదిద్దాలని పాకిస్తాన్ పాలకులపై వత్తిడి తీసుకువస్తోంది.

కాని పాలకులు ఈ డిమాండును అంగీకరించడానికి ఏమాత్రం సిద్ధంగా లేరు. వారు మతం వేరు, రాజకీయం వేరన్న దృక్పథంతో దేశాన్ని



మతప్రసక్తిలేని రాజ్యంగా చేయడానికి ఉవ్విళ్ళూరుతున్నారు. టర్కీ ప్రజాస్వామ్య పంథాను అనుసరిస్తూ కమాల్ (పాషా) రాజకీయాలను ఆశ్రయించారు. అంచేత పాకిస్తాన్ ప్రభుత్వం తాను అవలంబించిన మతరహిత వైఖరిని విమర్శిస్తూ ఇస్లామీయ వ్యవస్థను, ఇస్లాం శాసనాలను అమలుపరచాలని కోరే ప్రతి ఉద్యమాన్ని అణచివేయబూనుకున్నది.

కాని విచిత్రమేమిటంటే మతరహిత రాజ్యం కోరుకుంటున్న ఈ ప్రభుత్వమే అటు జఫ్రుల్లా ఖాన్ నేతృత్వంలోని ఖాదియానీ మత శక్తుల కొమ్ముకాస్తోంది. ఇలా పాకిస్తాన్ రెండు ప్రమాదాల మధ్య చిక్కుకొని ఊగిసలాడుతోంది. వెనుక నుయ్యి, ముందు గొయ్యిలా పాకిస్తాన్ అటు మతరహిత వ్యవస్థ కోరలకో, ఇటు ఖాదియానీ కబంధ హస్తాలకో చిక్కుకునే దుస్థితికి లోనయింది." ("ఖాదియానియత్"- పాదసూచిక)

ఏమయినప్పటికీ ప్రభుత్వం మాత్రం ఖాదియానీల విషయంలో తన పట్టును సడలించుకోలేదు. ముస్లిం మేధావులు, ధర్మవేత్తలు కూడా ప్రసంగాలు చేయడం, పుస్తకాలు వ్రాయడం ద్వారా ఖాదియానీ మతం గురించి ముస్లింలను హెచ్చరిస్తూనే ఉన్నారు. చివరికి 1984లో జుల్ఫికర్ అలి భుట్టో ప్రభుత్వం ఖాదియానీలను ముస్లిమేతరులుగా పరిగణిస్తూ ఒక ఆర్డినెన్స్ జారీ చేసింది.

ఈ ఆర్డినెన్స్ వెలువడిన తరువాత అప్పటి ఖాదియానీ ఖలీఫా మిర్జా తాహిర్ పాకిస్తాన్ వదలి ఇంగ్లాండు వెళ్ళిపోయాడు. లండన్‌ని శాశ్వత కేంద్రంగా చేసుకొని అక్కడ్నుంచి తన మత ప్రచార కార్యకలాపాలను పర్యవేక్షించసాగాడు. పాకిస్తాన్‌లో చట్టపరంగా ఖాదియానీలను ముస్లిమేతరులుగా పరిగణించబడినప్పటికీ, ఇతర దేశాల్లో మాత్రం వారు ముస్లింలుగా చెలామణి అవుతూ ఇస్లాం పట్ల ఏమాత్రం అవగాహనలేని ప్రజలను వంచిస్తున్నారు.

# పసలేని వాదనలతో ప్రచారం-11

ఖాదియానీల మతప్రచార లక్ష్యం నిరంతరం రెండే రెండు విషయాల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటుంది. ఒకటి- మసీహ్ మరణం, తద్వారా తమ నాయకుడు మిర్జాగారే మసీహ్‌మౌవూద్ అని నిరూపించేందుకు ప్రయత్నిం చడం. రెండు- జిహాద్‌ని నిషేధించడం. తద్వారా బ్రిటీష్ ప్రభుత్వాన్ని సమర్థిస్తూ దానిపట్ల విధేయత కలిగి ఉండాలని ప్రజలకు నచ్చజెప్పడం. ఈ రెండు విషయాల ప్రచార కార్యకలాపాల్లోనే వారు తమ సమయం, శక్తి సామర్థ్యాలన్నిటినీ వినియోగిస్తారు.

మిర్జా గులాం అహ్మద్ చెప్పిన ఇస్లాం యొక్క రెండు భాగాల్లో "బ్రిటీష్ ప్రభుత్వా నికి విధేయత చూపాలి" అన్న సమస్య ప్రస్తుతం మన దేశంలో సమసిపోయింది. కనుక ఖాదియానీలు తమ ప్రచార లక్ష్యంలోని మొదటి అంశం (మసీహ్ మరణం)పై దృష్టి కేంద్రీకరించి పనిచేయడమే తమ మత ప్రధాన ధ్యేయమని, గొప్ప ధర్మసేవని భావిస్తున్నారు.

హజ్రత్ మసీహ్ (అలైహి) మృతి చెందారన్న ఖాదియానీల వాదనలో ఏమాత్రం పసలేదని కాస్త జాగ్రత్తగా పరిశీలించి, ఆలోచిస్తే ఖుర్‌ఆన్ ద్వారానే తెలుసుకోవచ్చు. దివ్యఖుర్‌ఆన్‌లోని ఆలి ఇమ్రాన్ సూరాలో ఒక సూక్తి ఈ విధంగా ఉంది:

దేవుడు (ఈసాతో) ఇలా అన్నాడు: "ఈసా! నేనిప్పుడు నిన్ను నా దగ్గరికి రప్పించుకుంటాను. నా వైపుకు ఎత్తుకుంటాను. నిన్ను ధిక్కరించిన వారి (దుష్ట పరిసరాల) నుండి (తీసి) నిన్ను పావనం చేస్తాను..." (3:55)

ఈ సూక్తిలో "రప్పించుకుంటాను" అని అనువదించబడిన చోట మూల భాష అయిన అరబీలో "ముతవఫ్ఫీ" అనే పదం ఉంది. ముతవఫ్ఫీ లేక తవఫ్ఫీ అనే పదం నుండి దానికి సమానార్థకమైన 'వఫాత్' అనే పదం



రూపాంతరం చెందింది. వఫాత్ అంటే ఉర్దూ భాషలో మరణం అని అర్థం. ఖాదియానీలు ఈ పదాన్ని తీసుకునే హజ్రత్ మసీహ్ (అలైహి) చనిపోయా రని, కనుక మసీహ్ ఆత్మ మిర్జా గులాం అహ్మద్‌లో ప్రవేశించి ఈయన మసీహ్ మౌవూద్ అయ్యారని చెప్పుకుంటున్నారు. కాని ఈ భావంలో పైసూక్తిని ఇంతవరకు ఏ పండితుడూ అనువదించలేదు.

అరబీ భాషలో 'ముబాషిరత్' అనే మరొక పదం ఉంది. దీనికి తాకడం, ఆనించడం అని శాబ్దిక అర్థాలున్నాయి. కాని ఈ పదమే ఉర్దూ భాషలో వచ్చేటప్పటికి దానర్థం సంభోగించడం అని మారుతుంది. అరబీ భాషలో ఉన్న ఒక హదీసులో దైవప్రవక్త (స) ఉపవాసస్థితిలో 'ముబాషిరత్' చేసేవారని ఉంది. ఇక్కడ ఉర్దూ భాషార్థం తీసుకొని దైవప్రవక్త (సల్లం) సంభోగించారనడం ఇస్లాం విశ్వాసానికి విరుద్ధమే కాకుండా ఘోర పాప మవుతుంది. అలాగే 'తవఫ్ఫీ' విషయంలోనూ ఆలోచించాలి.

'తవఫ్ఫీ' అంటే సేకరించడం లేక వసూలు చేయడం అని అసలు అర్థం. ఆ పదాన్ని ఉపమానంగా ప్రాణం తీయడం అని సాధారణంగా వాడతారు. అంతేగాని శాబ్దిక అర్థంలో తవఫ్ఫీ అంటే ప్రాణం తీయడం అని ఎంతమాత్రం కాదు. పై సూక్తిలో దీన్ని శాబ్దిక భావంలో, ఇంగ్లీషు పదమయిన To Recall అనే అర్థంలో మాత్రమే ఉపయోగించడం జరిగింది. ప్రముఖ ఖుర్‌ఆన్ అనువాదకులు ఈ పదానికి చేసిన కొన్ని అనువాదాలను గమనించండి:

" ఓ ఈసా! నేను నిన్ను పూరిమ్తిగా తీసుకుంటాను; నిన్ను నా వైపునకు ఎత్తు కుంటాను." -తఫ్సీర్ ఇబ్నె కసీర్ (అల్లామా ఇబ్నె కసీర్)

"ఓ ఈసా! నేను నిన్ను (లాగి) తీసుకుంటాను; నా వైపునకు ఎత్తుకుంటాను." (మౌలానా షాహ్ రఫియుద్దీన్)

"ఓ ఈసా! నేను నిన్ను తీసుకుంటాను; నా వైపునకు ఎత్తుకుంటాను." -తఫ్సీర్ హఖ్ఖాని (మౌలానా అబ్దుల్ హఖ్ హఖ్ఖాని)

"ఓ ఈసా! నేను నీకు మరణం ఇస్తాను; (ప్రస్తుతం) నిన్ను నా వైపునకు ఎత్తుకుంటాను." -బయానుల్ ఖుర్ఆన్ (మౌలానా అష్రఫ్అలి థాన్వి)

"ఓ ఈసా! నేను నీ కాలాన్ని పూర్తిచేశాను; నిన్ను నా వైపునకు ఎత్తు కుంటాను." -తర్జుమానుల్ ఖుర్ఆన్ (మౌలానా అబుల్ కలాం ఆజాద్)

"ఓ ఈసా! నేను నిన్ను తీసుకుంటాను; నా వైపునకు ఎత్తుకుంటాను." -మారిఫుల్ ఖుర్ఆన్ (మౌలానా ముఫ్తి ముహమ్మద్ షఫి)

"ఓ ఈసా! నేనిప్పుడు నిన్ను వాపసు తీసుకుంటాను; నిన్ను నా వైపునకు ఎత్తుకుంటాను." -తఫ్హీముల్ ఖుర్ఆన్ (మౌలానా అబుల్ ఆలా మౌదూది)

"ఓ ఈసా! నేను నిన్ను స్వాధీనం చేసుకుంటాను; నా వైపునకు ఎత్తుకుంటాను." -తదబ్బురె ఖుర్ఆన్ (మౌలానా అమీన్ అహ్సన్ ఇస్లాహి)

"ఓ జీసస్! చూడు నేను నిన్ను సేకరిస్తాను (Gathering Thee); నా వైపునకు నిన్ను పైకెత్తుకుంటాను." -ది మీనింగ్ ఆఫ్ ది గ్లోరియస్ ఖుర్ఆన్ (ముహమ్మద్ మార్మడ్యూక్ పిఖ్తాల్)

"ఓ జీసస్! నేను నిన్ను తీసుకుంటాను (Take Thee); నా వైపునకు నిన్ను ఎత్తుకుంటాను." - ది మీనింగ్ ఆఫ్ ది గ్లోరియస్ ఖుర్ఆన్ (అబ్దుల్లా యూసుఫ్ అలి)

ఈ అనువాదాల్లో ఒక్క మౌలానా అష్రఫ్ అలి థాన్వి తప్ప ఏ ఒక్కరూ "తవప్ఫీ" అనే పదాన్ని మరణం అన్న భావంలో తర్జుమా చేయలేదు. థాన్విగారయినా దాన్ని ఉపమానపరమయిన అర్థంలో అనువదించినప్పటికీ,



ఇస్లాం మౌలిక విశ్వాసానికి భంగం రాకుండా ఉండేందుకు ఆయన బ్రాకెట్లో "ప్రస్తుతం" అని రాసి, హజ్రత్ ఈసా (అలైహి) ఆకాశం నుండి తిరిగివచ్చిన తరువాత సహజ మరణం పొందుతారన్న భావాన్ని స్ఫురింప జేశారు. మొత్తం మీద అనువాదకులంతా హజ్రత్ ఈసా (అలైహి)ని దేవుడు సజీవంగా, సశరీరంగా పైకి ఎత్తుకున్నారన్న అర్థంలోనే ఈ సూక్తిని అనువ దించారని ప్రస్ఫుటమవుతోంది.

మిర్జా గులాం అహ్మద్ మాత్రం సశరీరంగా ఆకాశానికి ఎత్తుకోబడిన హజ్రత్ ఈసా (అలైహి)ని తన వాడి వక్రభాష్యాలలో ఆకాశంలోనే హతమార్చి, ఆయన ఆత్మను తన దేహంలోకి బలవంతంగా జొప్పించుకున్నాడు! అంతటితో ఆయన ఊరుకోలేదు. దినదినం ఊసరవెల్లి రంగులు మార్చుతూ మొదట మర్యంగా, తరువాత మర్యం కుమారుడు ఈసా మసీహ్గా, ఆ తర్వాత మసీహ్ మౌవూద్గా, అటుపై సాక్షాత్తు దైవప్రవక్తగా, చివరికి యావన్మంది దైవప్రవక్త ల్లో కెల్లా అగ్రగణ్యుడిగా అవతారం ఎత్తడానికి నానా తంటాలు పడ్డాడు.

మిర్జా తన మతప్రచారం కోసం అనేక ప్రాంతాలు పర్యటించి బహిరంగంగా ప్రసంగించడానికి ప్రయత్నించాడు. కాని ఎక్కడికెళ్ళినా ముస్లింలు, వారి ధర్మవేత్తల నుండి తీవ్రమైన వ్యతిరేకత, నిరసనలే ఎదురయ్యాయి. కొన్నిచోట్ల జనం రాళ్ళు రువ్వడానికి కూడా ప్రయత్నించారు. కాని పోలీసులు, ఆంగ్లేయ సైనికులు ప్రతిచోటా అతడ్ని కంటికి రెప్పలా కాపాడుతూ ఉండేవారు.

ఓసారి అతను అమృతసర్లోని ఒక మీటింగ్ హాల్లో ఉపన్యాసం ఇవ్వడానికి సిద్ధమయ్యాడు. అది రమజాన్ మాసం పగటివేళ. కాని మిర్జా భక్తుడొకడు అదేమీ పట్టించుకోకుండా అతని దగ్గరికి ఓకప్పు టీ తీసు కొచ్చాడు. మిర్జా గులాం అహ్మద్ నిండుసభలో, ఉపవాసాలు పాటించే

సమయంలో ఎలాంటి తటపటాయింపు లేకుండా టీ కప్పును పెదవులకు ఆనించి తేనీరు త్రాగడానికి ఉద్యుక్తుడయ్యాడు.

దాంతో ఒక్కసారిగా జన సమూహంలో పెద్ద కలకలం మొదలయింది. మిర్జా గులాం అహ్మద్ పరిస్థితిని గమనించి "నేను బాటసారిని, బాటసారికి ఉపవాసాలు పాటించకుండా ఉండేందుకు (ఇస్లాంలో) అనుమతి ఉంది" అని సంజాయిషీ ఇచ్చుకున్నాడు. అయినా ప్రజలు అతని మాటలు వినకుండా అరుపులతో నానా రభస చేశారు. దాంతో మిర్జా గులాం అహ్మద్ ప్రసంగం మానేసి, పోలీసుల రక్షణలో బ్రతుకు జీవుడా అంటూ పట్టణం వదలి పారిపోవలసి వచ్చింది.

ఇలాంటి బూటకపు ప్రవక్తలను గురించే హజ్రత్ ఈసా ఇబ్నె మర్యం (అలైహి) బైబిల్‌లో ప్రజలను ఇలా హెచ్చరించారు: "ఎవడును మిమ్మును మోసపరచకుండ చూచుకొనుడి. అనేకులు నా పేరిట వచ్చి - నేనే క్రీస్తునని చెప్పి పలువురిని మోసపరచెదరు." (మత్తయి సువార్త- 24:4,5)

**(-సమాప్తం-)**





## మహాప్రవక్త (స)
## మహితోక్తులు

✦ **విశ్వాసికి తగని లక్షణాలు :** "విశ్వాసి (ఎవరినీ) నిందించే, దూషించే, శపించే వ్యక్తి కాలేడు. దురుసుగా మాట్లాడే, అశ్లీలపు మాటలు పలికే మనిషి కూడా కాలేడు." (తిర్మిజి–మిష్కాత్)

✦ **అసత్యం పర్యవసానం :** "మనిషి అబద్ధమాడినప్పుడు దుర్మార్గుడయి పోతాడు. దుర్మార్గం చేసినప్పుడు అవిశ్వాసి అవుతాడు. అవిశ్వాసి అయినప్పుడు నరకాగ్నిలో పడిపోతాడు." (ముస్నద్ అహ్మద్–మిష్కాత్)